కవిత్వం

# విరమించని వాక్యం



దాసరాజు రామారావు

# విరమించని వాక్యం

కవిత్వం

(2013-2017)

దాసరాజు రామారావు

మంజీరా రచయితల సంఘం
2018

# Viraminchani Vaakyam

*An Anthology of poetry*

by **Dasaraju Ramarao**
Email : daasaraju@gmail.com

© Poet

| | | |
|---|---|---|
| Cover Paintings | : | Sina March, K. Nageshwara Rao |
| Cover Design | : | Ravishankar |
| First Edition | : | February 2018 |
| For Copies | : | D. Vijayalakshmi<br>Plot No: 143,<br>H.No: 13-30/79<br>Sai Bhagavan Colony (Beeramguda)<br>BHEL, Ramachandrapuram (Post)<br>Sangareddy Dist-502 032<br>Cell: 96182 24503<br><br>Palapitta Books<br>16-11-20/6/1/1<br>403, Vijayasai Residency<br>Saleem Nagar, Malakpet<br>Hyderabad - 500 036<br>Phone: 040-27678430 |
| Printed at | : | Karshak Art Printers<br>Vidyanagar<br>Hyderabad |
| Price | : | Rs. 60/- |

మట్టి దీపాలైన
తెలంగాణ వైతాళికుల
ఉద్దీపనలకు...

## పబ్బతి

నా ముందు నడుస్తున్న
నాతో నడుస్తున్న
నా వెనుక నడుస్తున్న
 – కవిలోకానికి...

కవిత్వం బతికుందని
రుజువు పరుస్తున్న
 – ఆర్ద్ర క్షణాలకి...

## ఆత్మీయ ఆలింగనం

శివారెడ్డి
సిధారెడ్డి
గుడిపాటి
దేశపతి

# పద గమనం


| | | |
|---|---|---|
| 1 | జననీ జయకేతనం | 11 |
| 2 | నీడ–జాడ | 14 |
| 3 | వెనిజులా వెన్నెల | 16 |
| 4 | మనిద్దరమొక పద్యం | 18 |
| 5 | జాతర | 21 |
| 6 | చినుకొకపరి | 25 |
| 7 | మృగయా వినోదం | 27 |
| 8 | ఆ ముఖం.. | 29 |
| 9 | మోహనం | 31 |
| 10 | సహజాతం | 34 |
| 11 | ప్రశ్న... ప్రశ్న గనే | 35 |
| 12 | కవి వెంట | 37 |
| 13 | ఆకుపచ్చని శ్వాస | 39 |
| 14 | అమర స్మృతి | 41 |
| 15 | మతం గురించే మాట్లాడుకుందాం | 43 |
| 16 | అమ్మ సంతకం | 46 |
| 17 | ఏవో ఏవేవో | 49 |
| 18 | ఒక్క మాట | 51 |
| 19 | నేను ... | 54 |
| 20 | దృశ్యభ్రమణం లోంచి | 56 |
| 21 | మృత్యు గానం | 59 |
| 22 | పిలుపు | 61 |
| 23 | ఆవిష్కృతం | 62 |
| 24 | అమ్మాయి వెళుతోంది | 65 |
| 25 | వెనక్కి తిరిగి . | 68 |
| 26 | యుద్ధ వాంఛ | 70 |
| 27 | కవిత్వమే | 73 |
| 28 | పాలించవె బతుకమ్మ | 75 |

| | | |
|---|---|---|
| 29 | కొన్ని ప్రశ్నలు - ఒక ముగింపు. | 77 |
| 30 | కాన్వాసు పై దృశ్యం | 79 |
| 31 | మరొక అక్షరం | 81 |
| 32 | వాళ్ళ గనక | 83 |
| 33 | కల .. | 86 |
| 34 | అన్నదాత దు:ఖీభవ | 88 |
| 35 | వాన మాయ | 90 |
| 36 | నెవర్-ఎవర్ | 91 |
| 37 | అపసవ్యం... | 92 |
| 38 | సువర్ణ తెలంగాణ | 94 |
| 39 | సార్వభౌముడు | 97 |
| 40 | కవి జన్మ | 99 |
| 41 | ఆ రెండు పిట్టలు ... | 101 |
| 42 | తడిగీతాల వాడు | 104 |
| 43 | సంబురం.. | 106 |
| 44 | తల్లిగారి ఊరు | 109 |
| 45 | లేనితనం | 112 |
| 46 | కవితా వందనం | 114 |
| 47 | జంట పథం | 116 |
| 48 | తెలంగాణీయత.. | 117 |
| 49 | పండుగొచ్చిన వేళ | 119 |
| 50 | బాపు లెక్క ఎవ్వరుండరు | 121 |
| 51 | స్టైల్ ఆఫ్ లైఫ్ | 123 |
| 52 | ఎంతవాడు... | 125 |
| 53 | ప్రియవచనం | 127 |
| 54 | తెలంగాణ ముఖచిత్రం. | 128 |

# జననీ జయకేతనం

అణగదొక్కిన చరిత్ర కిప్పుడు
పట్టాభిషేకం

పురిటి గండాల నీది
బాలారిష్టాల తట్టుకొని
యవ్వనోద్రేక ప్రమాదాల దాటుకుని
పళ్ళూడే షష్ట్యాదశమాంకపు జీవితాన
కల ఇంటికి చేరిన వేళకి
దండం

గోలకొండ కోటల తెగిన రామదాసు సంకెల
ముడుపులు తీర్చిన మూలపుటమ్మలు సమ్మక్క సారక్క
పెత్తనాన్ని తుత్తునియలు చేసిన రుద్రమ కరవాలం
కొమురం భీం తలపాగల మెరిసిన చంద్రవంక

మడికట్టుల మొలిచిన నాగేటి చాళ్లల్ల
గోదావరమ్మ అలుగు దుంకిన వేళకి
దండం

పాయిదార్లు పట్టిన భాషా యుద్ధంల

జీవగంధపు పరిమళం చిమ్మిన యాస
కడుపు చూసి, పీట ఏసి
అంబలి పట్టిన పెద్దముత్తయిదువ
ఎడ్డితనమనే ఎక్కిరింపుల
మూర్ఛిల్ల జేసిన మల్లినాథుని అక్షర వెలుగు
కారం పొడి, చీపురుకట్టలే
తరతరాల బూజు, బురుజులను ధ్వంసించిన
కొట్లాట ముచ్చట
భూమిల నిక్షిప్తమైన సాంస్కృతిక నిధుల పొద్దుపొడుపు

కలవరపడ్డ కళలన్నీ బతుకమ్మ చుట్టూ
అల్లుకుపోయిన వేళకి దండం

మెదళ్ల సాగులో కాంక్షాకురాలు
పూయించిన సిద్ధాంత బ్రహ్మ నవ్వుతున్నడు
సకలం బందుల్, మాడ్చిన కడుపుల్, సాగర హారాల్
తీరొక్క జిద్దుల
తిమ్మిరెక్కించిన ముఖాల అలసట అలసిపోయింది
ఇనుప కంచెలను రబ్బరు బుల్లెట్లను
ఎడం కాలితో తన్నిన ఉస్మానియా కాంపస్
సర్టిఫికెట్లకు పటం కట్టుకుంటున్నది
కల చిగురుటాకై వణికినప్పుడల్లా
బతుకుల దహించుకుని
ఇంధనమైన అమరులస్తూపం
గెలుపుని ముద్దాడుతున్నది

బక్క ప్రాణానికీ
భారీ లక్ష్యానికీ
అరవై ఏళ్ల దూరం

బుకా గులాల్ తో ఎదురొచ్చిన వేళకి
నాలుగున్నర కోట్ల దండం

ఇక
తెలంగాణ పదం
ప్రపంచం నోటి నిండా !

# నీడ-జాడ

**ఊ**హల పరిమళాల కోసం
పూలతోట కెళ్ళిన –
కందిరీగలు చుట్టుముట్టి
ఉహల్ని కాటేసినయి

వెన్నెల దీపాల కోసం
ఆకాశం వైపు దారితీసిన –
పిడుగుల పిడిగుద్దుల
మేఘాల గర్జనకు
దీపాలారినయి

చేతలు నేర్చుకుందామని
సముద్రం దాపున చేరిన –
ఎగిరే కెరటాల పొగరుకు
చేష్టలుడిగినై

రంగుల నడుగుదామని
ఇంద్రధనుస్సు నాశ్రయించిన –
రక్తమోడుతున్న దృశ్యం రీళ్ళను తింపితే
చీకటి రంగొక్కటే కమ్ముకొన్నది

పాటల పల్లవుల కోసం
పక్షుల గుంపును కలిసిన –
విరిగిన  చరణాలే

చెదరిన రాగాలే
కూలబడిన పాటే దొరికింది

పిల్లబాట కావాలని
ఆశ్రయాల పొదుగైన అడవిని చేరిన –
పల్లెకూరాడు పగిలినప్పుడే
అదీ ముక్కలైందని చెప్పింది
బాట రహదారిల కాట కలిసింది

పాలపటువ కై పాకులాడిన –

అమ్మ కిష్టమైన  మట్టిగాజుల కోసం
దునియా మర్లేసిన –

అరుగుమీది ఉప్పస–ఊరట ముచ్చట్ల కోసం
జోలె పట్టుకుని తిరిగిన –

హైపిచ్ భవంతి నట్టింట్ల
మనవడితో లేని ఆటలు
'నెట్టింట్లో' ఆడుతున్నట్లు నటించిన –

ఊరి గైని మీద పొద్దున
చెరువుకట్ట మీద పొద్దింజామున
గునుక్కుంటూ...గునుక్కుంటూ ....నీడొక్కటే

నాకు నేనే
తారసపడుతున్న!

# వెనిజులా వెన్నెల

తిరుగుబాటు గీతానికి
ఆఖరి ఘడియ లుండయి
మనో సంకల్పానికి మరణ వాసన తగులది
వెనిజులా వెన్నెల
టార్గెట్ వృత్తంలో చిక్కది
తప్పించుకుంటనే వుంటది

వాడు
తన ప్రజల చుట్టూ వృత్తాన్ని గీసి
కావలి  వుంటడు
కొమ్ములు మొలిచిన పెత్తనపు సవాల్ కి
'భూత' మని పేరు పెట్టి,
భయపెడుతడు
వాటా లెక్కల తులాదండం
పాసంగాన్ని సవరిస్తడు
ఆయిల్ బావుల మీద పరచుకొన్న
గద్దల కలల్ని
చమురొదిలే దాక  కలవరపెడ్తడు
పెట్టుబడి విష పుత్రికకు
చెమట సుగంధపు రుచి నద్దినవాడు

సోషలిస్ట్ భావానికి నిలువెత్తు క్రియాపదం
వాని ఊబకాయం లోంచి
ఎగజిమ్మిన ధిక్కార స్వరం
మరిన్ని దేశాలకు పోరాట వనరు

క్యాన్సర్ కణాలకు
ఆఖరి కలవరింతను అప్పగించి, వెళ్లి పోయిన
ఛావేజ్
అద్దాల శవపేటిక లోంచి
తన ప్రజల భయరహిత ఆనంద క్షణాలను
వీక్షిస్తనే వుంటడు

అతని పార్థివ దేహ యాత్రలో
అందరూ భూతం మాస్కులను ధరించి, వచ్చి
తగలేసి  పోతుంటరు

# మనిద్దరమొక పద్యం

అట్లా నీలోకి
ఒక వాక్య తరగనై ప్రవహించాలన్నా
నీ కనురెప్పల కింద
కలా విచిత్రమై దోబూచులాడాలన్నా
నీ నాలుక చివర
తేనెతెట్టెనై పూర్ణించుకోవాలన్నా

నేను నిప్పుల మీద సలసలా మరిగే కన్నీరవ్వాల్సిందే

నీ పక్కన మూగి
బుడిబుడి అడుగుల ధ్వనిసరాగం వినిపించాలన్నా
నీ ఉసూరనే వేళల
సన్నని వానతుంపరై చక్కిలిగిలి పెట్టాలన్నా
నీ పాదాలలసిన తొవ్వల
చెమట నద్దే పాటగా స్పృశించాలన్నా

నేనీ మట్టిపొరల కింద రాచిరంపాన పెట్టుకోవాల్సిందే

నీ చెంప కానించిన
కొనగోటి సమయాల్లోకి
దుర్లభ కవిసమయమై దూరాలన్నా

నీ ముడేసిన పెదాల వృత్తంలో
శబ్దాలంకారమై పులుముకోవాలన్నా
చంద్రాంశ తొంగిచూడని నీ ముఖ వర్చస్సులో
వేయి పున్నమల Poem మై నిండిపోవాలన్నా

ఎన్నో కాళరాత్రుల కొరడాలతో హింసింపబడాల్సిందే

నీ తల మీద మోస్తున్న జ్ఞాపకాల బుట్టలోకి
మధురోహనై తొంగి చూడాలన్నా
నీ కనుకొనల జారిన బాష్పవలయం చుట్టూ
పరితప్త కందిరీగనై గిరికీలు కొట్టాలన్నా
నీ చాచిన చెయ్యి లోంచి
భవిష్యత్ మాధుర్యాలను కలుగునై, తోడుకోవాలన్నా

జుట్టు పట్టుకొని సముద్రంలోకి లాక్కెళ్ళి
నన్ను నేను వందసార్లు ముంచుకోవాల్సిందే

నీ నుదురొక అరణ్యమై విస్తరిస్తే
విల్లెక్కుపెడుతున్న బంజారాగీతమై కలియతిరగాలన్నా
నీ హృదయ మెక్కడో కాట గలసిపోతే
దారుల దిగ్బంధనంలో
పోగయ్యే సామూహిక వేదనాభరిత వేదికపై
నిన్ను కనుగొనాలన్నా
జీవిత మెక్కడో కుంటుతున్న కుక్కపిల్లై
కాళ్ళకడ్డం పడితే
అమ్మ కడుపులో కెళ్ళి మమకారాన్నింత మోసుకురావాలన్నా

నాకు నేనే పుల్లలు పుల్లలుగా విరుచుకొని
కట్టగట్టుకొన్న మోపుగా

కొత్తగా అవతరించాల్సిందే

ఇప్పుడు చెప్పనా
నువ్వెవరివో
నేనెవరినో

నువ్వు
నూరంకెలు లెక్క బెడుతున్న బతుకుచుట్టూ
మూగిన  ఆశయానివి
నీ అడుగులకు మరింత
నూరేళ్ళ బలాన్నద్దుతున్న
నేను
శిల్పాన్ని

# జాతర

మాఘం వచ్చిందో జాతర్ల వైభోగం షురూ
మా పుల్లూరు బండ జాతరంటే
పెంచిన పెద్దమ్మ ఒళ్ళో నంద గోకులమే నాకు
యాడాదెల్ల ఉత్సాహాన్ని గల్ల గురిగిల కూడబెట్టుకుని
ఆ మూడు రోజుల్లో నింగినంతా ఎగజల్లుకొన్నట్టు–

దుకాండ్లు పడ్డయా లేదా అని
నాలుగు రోజుల ముందునుంచే చూడటం,
"పడ్డయి పడ్డయి" అని ప్రచారం చేయటం
కుర్రతనానికి గుర్రమెక్కినంత–
గుండం చుట్టూ తిరిగి
డై కొట్టి, అడుక్కు చేరిన చారానా బిళ్ళని అందుకుని పైకి తేలటం
సిందూబాద్ సాహసయాత్ర లాంటిదే
దేవుడు మాత్రమే పట్టే గర్భగుడిల జొర్రి,
దీపకాంతుల్ల, అగరుబత్తీల పొగల్ల
భక్తి పారవశ్యంతో ఊపిరి ఉక్కిరిబిక్కిరినీ లెక్కచేయనితనమే
గోపాలకాల్వల నాడు
పల్లకిల ఊరేగే స్వామివారి పాదాలు తాకాలని, తాహతు చాలదని తెలిసి,
బోయీలను ముట్టుకుని తరించే తాపత్రయమే

పెద్దబాపు రాసిన నరసింహసామి శతకం ప్రతులను
40 పైసలకే అమ్మి
పిత్రురుణం తీర్చుకున్నట్లు పొంగిపోవడమే
కింద  రాయో, తాటాకు మట్టో పెట్టుకుని
జారుడుబండ మీంచి జారటం, లాగుకు చిల్లులు పడటం,
దెబ్బలు రుచి చూడటం ఓ వింత ప్రక్రియలే
బండ మీద గీతలు చూసి
సీతను రావణుడు ఎత్తుకెళ్ళే టప్పుడు
జటాయువు పోరాడిన గుర్తులని
వీరోచితంగా చెప్పుకొనే వాళ్ళమే
పరుపు బండ మీద జారక నిలవడ్డ గుండ్రటి బండలమీది కెక్కి
గొంతెత్తి లోకానికి స్వాగతం పలికితే, మా పలుకు మాకే
వినిపించేది
లాయిలప్ప కొని, భూమికి అరచేతి గుప్పిటికి తాకిస్తూ ఆడటం,
పిల్లంగోవితో తూ తూ రాగాలు పలకటం,
ప్లాస్టిక్ రంగు కళ్ళద్దాల్లోంచి కండ్లెగరేసుకుంట చూడటం,
'నరసింహసామినిరా నిన్ను నమలక తింటను' రా
డ్రమెటిక్ గా పాడటం
పొగరెక్కిన వేళలే అవి-
బండ ప్రాశస్త్యం, చరిత్ర తెలియకుండనే
మనదే జాతర అనుకొని, లీనమయ్యేది
సిద్ధిపేటతో కలుపుకుని
పుల్లూరు చుట్టూ పది గ్రామాల పెట్టు
బండ మీదికి బండ్లు బండ్లుగ, దండ్లు దండ్లుగ తరలేవి
దీనస్థితల జాతరకు వెళ్ళలేనప్పుడు
వాకిలి అరుగు మీద కూచుని
వచ్చే పోయేటోళ్ళ కళ్ళలోని ఖుషామత్ ని తోడుకునేటోన్ని
మరిచిపోయిన దోస్తుల, దూరమైన చుట్టాల, ఎడమైన  ఆలుమగల
ఎదుర్కోళ్ళ తీర్గ ఎదురుపడనిచ్చేదీ జాతరే

మూడోనాడు కొనుక్కొనుడు, దావత్ చేసుకొనుడు
బుట్టి దుకాణపోల్ల గల్ల గల్లర గల్లర మోగితేనే
మళ్ళేడాది ఇటెంకల తిరిగి చూస్తరు
బత్తీసపేర్లు, బొంగుప్యాలాలు, జిలేబి పొట్లం కొనని
జాతరయ్య, జాతరమ్మ వుండనే వుండరు
బండకింద చెట్ల నీడన
మోదుగు దొప్పల్ల తాటికల్లు, అంచుకు బుడాలు, గుడాలు
వుండాల్సిందే
జాతర ముగింపుకు పల్లెటూరిచ్చే
నిర్వచన హేల అది

ఆఖరి ఘట్టంగా ఉత్తుత్తి దొంగాట
'గుడిలోంచి దేవుడి నగలు మాయం' అని
అయ్యగారు గాయి గాయి పెడ్తడు
కొంత తంతు నడిచినంక
దొంగ, నగలు దొరికినట్లు
స్వామి మహిమాన్వితుడని దండక మెయ్యటం
ఒక హెచ్చరికా వినోదం

జాతర ముగిసింది
మళ్ళొచ్చే జాతర
మళ్ళ మళ్ళ జాతర్ల మీద జాతర్లొచ్చె

నేను పోలేదు
అప్పటి గల్ల-గురిగి కన్న
ఇప్పటి పర్సు బరువెక్కువైనా
అటెంకల పోలే
పెద్దాయి, పెద్దబాపు
మరణశ్వాస తీసుకున్నరు

కండ్లు మలుపనియ్యని
కళలు నేర్వనియ్యని
వీడియోగేముల్ల తల దూర్చిన నా చిన్నారులకు
నా బాల్యపు జాతర చూపించడానికి
పుల్లూరుకు పోవాల్సే వున్నది

ఆ మెత్తని ఒడి స్పర్శను తలచుకొంటూ ...

# చినుకొకపరి

సుఖ స్పృహా స్పర్శిత చినుకు
ప్రకృతి మనసు తొణుకే అది

జలతారు అంచు కల
దిగొస్తున్నట్టు

నిశ్చలన చాయా చిత్రంలా
ప్రవహిస్తున్నట్టు
ఎత్తు పల్లాల  చరిత్ర జాడ్యాన్నంతా
ముంచేసి
ఏక కావ్య ధారగా

రాజుగారి వేషం తడిపి
బికారి గాడి దేహం తడిపి
ఒక ముద్దగా
ఒక్క తీరైన పులకరింతగా

చిందిన చెమట చుక్క
భూమీ్మది పసరిక
కలెగల్పిన  కొత్త ఆకృతి  ఇంద్రధనుసు

తడిసిన గూడైనా
పొదివి తెచ్చుకున్న వెచ్చదనపు
గువ్వల ప్రేమైక కౌగిలి

ముఖాల రంగులు కరిగి
సుస్పష్టమైన, ఆకుపచ్చని ఆకైన
మనః దర్శనం

ఆకాశం, నేలా, జీవజాలం
వాన మోహం లోనే...

కాగితప్పడవల బాల్యం
బతుకుల్లోన వాన

ఏం వాన !

# మృగయా వినోదం

చుక్కల్ని ఆశ చూపి
పున్నమ రేయిని దోచుకుపోయిందెవరో

మెరుపుల మురిపెం ఇచ్చి
వాన జాణను చెర బట్టిందెవరో

మబ్బుల మూకుమ్మడి దాడి తో
ఆకాశ యజ్ఞాన్ని భగ్నం చేసిందెవరో

ఉత్తర ఉరుములతో భయపెట్టి
దక్షిణ ద్వారం గుండా ఉడాయించిందెవరో

పడమటింటి మజిలీ తెలిపి
తూర్పు దీపం ఆర్పివేసిందెవరో

పగటి కునుకును ఎరవేసి
కాళరాత్రిని నింగినంత అలికిందెవరో

పవన వీచికల్ని గుప్పించి
ఊహల కలివిడిని చెదరగొట్టిందెవరో

ఏం లేదూ...

ప్రకృతిని కాస్త వికృతిగ  మార్చిందెవరో

మనిషి చెవిలో రహస్యం వూది
మృగంగ  తయారు చేసిందెవరో

ఇప్పుడు

నిత్య సంచారి
లోక అపకారి
ఈ మృగం ఆకలికి బలౌతుందెవరో

# ఆ ముఖం

ఆజానుబాహు,అరవింద దళాయతాక్షుడని
పొగుడుతూ, పోలిక చేయలేను గని...

కన్నీటి కావ్యాలకు
కారుణ్య భాష్యం చెప్పగలడు
భుజం మీద చెయ్యేసి
మాటకు తోడుగా నడువగలడు
పూల సుగంధాన్నో, వెన్నెల సమీరాన్నో
వెంట బెట్టుకుని తిరుగుతుంటడు
కొత్త పరిచయాన్ని  పాత స్నేహంగా
పరిష్వంగానుభూతమై, పరవశిస్తుంటడు
అటుకుల మూటైనా లేకుండా
గడపలోకి కాలు పెట్టడు
ఎవ్వరి అమ్మనైనా
చివ్వరి కొడుకై అల్లుకు పోగలడు
సాహిత్యానికి ఓ హితవరై,
తండ్రి తృప్తి పొందగలడు
ఆఫీసర్ కాగలిగినా
ఛాంబర్ సహాయకకేంద్రమే
బంధువులకు అందిన కొమ్మ
అన్నదమ్ములకు తలాపున చెరువు

ఉమ్మడి కుటుంబానికి అమ్మఒడి
చూసినప్పుడల్లా
గుండుసున్న చంద్రబింబమై
చంద్రకాంతి వెదజల్లుతున్నట్లే
ఆ ముఖం

పుటలెన్ని భారంగా,బరువుగా తిప్పబడ్డవో
సంసారతీరంపై సేదదీరే వేళకి
యధాలాపంగ అలవాటైన వక్కరుచి,
అతడి ముఖాన్ని నమిలేసింది

తువ్వాల అడ్డం పెట్టుకుని కనిపిస్తున్న
అతన్ని,
దుఃఖ దగ్ధహిత మేఘం కమ్మేసిన
ఆ ముఖాన్ని
తేరిపారా చూడలేను
హృదయానందానికి
ముఖారవిందానికి
పోలిక చెదరడమెట్లా సహించేది

ఫోన్‌లో అతని మాట వింటున్నప్పుడు
పూర్ణ చంద్రుని ముఖ కవళికల్ని
అతని ముఖంలో
నేను ఊహించేది

అతడెప్పుడూ
మునుపటి అందగాడే

# మోహనం

రెప్పల మధ్య దాగుడు మూతల హిమవర్షం
కొలను నీటి అడుగున ప్రకంపనల గగన మనోఫలకం
మరణ గాలానికి చిక్కకుండా
నునుపుగా జారిపోయే చేపపిల్ల చాకచక్యం
రోజువారీ ఉదయాహ్వానానికి
తానున్నట్టు ప్రకటించే కోడిపుంజు
పరిమళమే ప్రేమగా
వర్ణమే సౌందర్యంగా
పుప్పొడే సజీవసారంగా పూలభాష
కవిత్వపు నురగల, తరగల, పరుగుల కావ్య కడలి
తారామణుల నాట్య సమ్మేళనానికి
హృదయాన్ని పరిచే ఆకాశం
పక్షి, రెక్కల కింద పొదవుకొని
ప్రోది చేసుకునే ఆశల వెచ్చదనం
చేల తల నిమురుతూ, తరలిపోయే సమీరం
ఒక్క ఆకు తుంచితే, నిలువెల్లా గాయపడే తరువోజ
కొండల చాటు నుంచి, గుండె
మరెన్ని ధైర్యాలు తెచ్చుకుంటదో
నల్లా నుంచి నీటి బొట్టు రాలకున్నా
కాకి ప్రయాణం అబ్బురమే
గూనపెంకుల వానధారలతో

అద్భుత విన్యాసాల నావిష్కరించే
పసిప్రాయాలు
ఎందరెందరి పిలుపులనూ, చూపులనూ
వడకట్టి,
తెరుచుకుంటూ, మూసుకుంటూ నల్లగేటు
గోడకు వేలాడే పటం లోని పెద్దమనిషి
కావడి బద్దకు రెండరటి గెలలు వేసుకొని
కత్తుల పొద్దు అంచున నడుస్తుంటడు
సద్దిమూట సూర్యుడు తోడుగా
లంబాడి ముదిత కట్టెలమోపు నెత్తుకుని
అమ్మకానికి తిరుగుతుంటే
ఆమె జాకెట్ అద్దాల్లో లోకం
వింత రంగుల్లో మెరుస్తుంటది
అందమైన వాక్యంగా మారి, కొంగల గుంపు
ఆకాశాన్ని కవిత్వమయం చేయడానికి వెళ్తుంటది
ఇంటి పెరటి కల్యామాకు చెట్టుతో
కరచాలనం చేసినప్పుడు
బాల్యపు ఊసుల  బాతాఖానీ విన్పిస్తుంటది
గోటీలాటలో
బొద్దిలో పడని గోటీలమూట విప్పినపుడు
ఎర్రగా వాచిన మోచేయి కింద
విజయ రహస్యం ఉవ్విళ్లూరిస్తూ కన్పిస్తది

మట్టి జిగితో
ఆకాశపు చెమ్మతో
తలంపుల మరువపు అల్లికతో
ప్రేమిద్దాం...
బతుకుని,
అంతకు మించి కవిత్వాన్ని-

కవిత్వమే జీవితం
జీవితమే కవిత్వం
అనుకునేంతగా
పెనవేసుకునేంతగా
జీవిద్దాం

# సహజాతం

అక్షరాలెక్కడెక్కడో వెతుక్కుంటున్నయి, తమ చుట్టే మూగే కళాత్మక అల్లెతాళ్ళ పదాలెక్కడో జాడ తప్పినాయని. పువ్వులు లబోదిబో మంటున్నయి, వాసనలు, వర్ణాలు స్పృశిస్తేనే నొచ్చుకునే కుసుమ పేశల సౌందర్య ముగ్ధత్వాలు గాలి కుయుక్తుల జోలెలో పడి, మటుమాయ మయ్యాయని. నిదుర మరపులో ఒత్తిగిల్లిన నయన ద్వయానికి, విరిగిన స్వప్నక్షోభ తెలిపే సుతారపు కలల పూత ఏ ఋతువు పూయునో. మబ్బుల మాటల నెత్తుకు పోయిన ఆకాశం, తనకో మనసున్నట్లు, భూమి చెక్కిళ్ళను నిమురుతది గారంగా. పారుతున్న యేరు ప్రాచీనులైన, తన వాళ్ళయిన రాయి రప్పల్నీ దాటి వచ్చినానని వ్యథార్థంగా గునుగుతుంటది. అడివిల తప్పిపోయిన పక్షి తన కూతను, గొంతులోకి తెచ్చుకోడానికి నూర్ల తీర్లుగా అరచుకొంటది. ఎల్లలు దాటి ఆడుకుంటున్న అలల్ని గుంజుకపోయింది వెన్నెలే నని, ఫిర్యాదు చేస్తది నది. నేల మీద పడ్డ నిందలన్నీ ఒక్క వాన ధాటికే పరుగు పెడుతుంటయి.

నేల పాతివ్రత్యానికి సూచిక
భూమి పుత్రుడి హెూరెత్తే పోరు సంస్కారమే.

# ప్రశ్న... ప్రశ్నగనే

సమాధాన పడని ప్రశ్న

పూలు వుంటయి
ముళ్ళు వుంటయి
పూల దారి పూలదే
ముళ్ళ దారి ముళ్ళదే

ముళ్ళు నంగి, పూలను రక్త సిక్త పరచడమే
తట్టుకోలేనిది

గగన విహారం గొప్పదే
నేలమీది నడకా గొప్పదే
ఆకాశం భూమిని ముద్దు పెట్టుకోదు
భూమి ఆకాశాన్ని ముద్దు చేయదు

ప్రశ్న పాతదే
కొత్తగా బాధిస్తుంటది

గాలి రెక్క విప్పుతుంటది
పక్షి రెక్క సాచి, ఎగురుతుంటది
కిరణం పుట్టుకొచ్చి, చీకటి పొట్టలో
దిగుతుంటది
త్యాగమా, సహజమా
చర్చ చేసి, ఖాళీగా వెళ్ళిపోవడమే
భరింపరానిది

ఒక మబ్బు, కన్నీళ్ళు కురిపిస్తది
ఒక మేఘం, కలల్ని వెంటేసుకొస్తది

కలల కోసం  కాసుక్కూచోవడమే
విచిత్రమనిపిస్తది

ప్రశ్న మధురం గనే
మభ్య పెట్టడానికి చూస్తుంటది  ఒక్కోసారి

ఆకులు రాలి, రాలి
చెట్టు అమ్మతనం కోల్పోతుంటది
అలలు ఎగసి, ఎగసి
సముద్రం రగిలి పోతుంటది

కదమో, పదమో ఆచి తూచి
అడుగేయడమే సిగ్గనిపిస్తుంటది

గుడిసెను తడిపిన వాన
మహల్లో కురిసిన వెన్నెల
పోలిక కుదుర్చ లేక
కవి మనసు తంటాలు పడుతుంటది

ప్రశ్న, ఫక్కున నవ్వి
బేతాళుని వలె
జీవితమంతా పరిహసిస్తనే వుంటది

# కవి వెంట

నేనొక్క మాటే మాట్లాడుత
అది వందసార్లు చెల్లుబాటు కావాలె

అడవిల ఒళ్ళు విరుచుకునే
వెన్నెలెందుకు ?
నా కంటి ముందు నాట్యం చెయ్యాలె
నెమలి పురివిప్పి, ఆడి, అలరించే దేమిటి ?
నా సౌందర్యారాధనకి
విశ్వం పులకించి పోవాలె
మబ్బుల వాన సోనల్ని, చుక్కల కౌంట్ లెస్ కులుకుల్ని
ఆకాశం
ఇష్టానుసారం వాడుకొనుడేనా ?
ప్రతి ఉదయాన్ని సొంతంగా, సాంతంగా
ఆస్వాదించే, విజయాల వైపు నడిపించే
హక్కున్న అరుదైన ఒక్కడినే
నలుగురికి కాని క్రిక్కిరిసిన బాటలెవ్వలకు ?
కలిసి నడిచే తొవ్వల కోసం
జనం నెన్నుదుట
అదృష్ట సమయాలను రచిస్తుంట
ఋతువుల్ని సిగల ముడుచుకొని
కాలం కలికాలం వెంట
పరుగులు తీయడమేమిటి ?

ప్రతి పాదుకు ఆయుస్సు పోసి
ప్రతి పక్షికి ఇచ్ఛ, స్వేచ్ఛలిచ్చి
ఆరు ఋతువులకి అనురాగాలు నేర్పి
ప్రకృతి కేలు పట్టుకుని
నడుస్తున్న నావెంటే ఏ కాలమైనా నడవాలె

తేనెతుట్టెను కదపటమెందుకు ?
తేనె వానలకు హామీ లేమిటి ?

ఒక ఊహ, ఒకస్పృహ, ఒక భరోసా స్పర్శ, ఒక రహస్యానంతర
జిలుగు ధార
ఒకానొక మైమరపించే మేల్కొలుపూనూ
కవిత్వమేనోయి

అక్షరం... కాలం... మనిషి
చెట్టాపట్టాలేసుకొని నడిచే సహజ జీవన దృశ్యాన్ని
నేను గెలువబోతున్న కల

# ఆకుపచ్చని శ్వాస

గోడలు కట్టి ఇరికిరికైన హృదయంలో
ఒక విత్తు నాటిన -
యిక అప్పట్నుంచీ,
ఉదయమవ్వటం కోసం ఆకాశం
ఎదురు చూచే స్థితిలో, నేను కూడా

కళ్ళు విప్పి, ఆ పొదు దగ్గర్నుంచే
దినం మొదలు
మమతలతో మట్టి కుదుళ్లను సవరించి
పుట్లకొద్దీ పుట్టే భావాల సెలయేరుల జల చిలకరించి
కంటి కాంతి లే వెలుగుల సూర్యరశ్మి నందించి
గుండె గవాక్షం లోంచి, మలయ పవనాల
ఊపిరు లూది

పిట్ట నల్ల మీదెక్కి
నీటి ముత్యం కోసం మోసపోయింది
పువ్వు గొంతెండిపోయి
నవ్వు ఆగిపోయింది
లంబాడోల్ల పిల్ల ఎంత దూరం నడచిందో

ఎన్ని మెట్లు దిగిందో
కుండ నిండిందో లేదో

గుర్తుకు వస్తే, అక్షరం విరుగుతది

నీటి జాడలు దాచిపెట్టలేని
అడవినేం తప్పు పడతం
మొండెం తెగిందాయె
నీటి ఊటలు దాచిపెట్టలేని
భూమినేం తప్పు పడతం
ఆఖరి బొట్టొడిపి,శవమాయె
ఎంత మొర పెట్టినా, వినని మేఘాలనేం
తప్పు పడతం
విష గాడ్పుల దాడికి, అవిటివాయె

వక్షస్థలాన్ని చీల్చితే, ఆత్మారామునికి బదులు
వృక్షం కనిపించదు

పొద్దున్నే పాదు ముందు నిలిచి
నా 'బర్త్ డే' అని చెప్పుతుంటే
రెండాకులూపుతూ ఆశీర్వదించింది
మొక్క –

# అమర స్మృతి

ఆగిన వాగును
మత్తడి దుంకించిండ్రు
వంకర సాగే కొమ్మలను
పందిరి అల్లిండ్రు
కలవరపెట్టే చేష్టలకు
కాంక్షాగీతమై నినదించిండ్రు
పలుచన చేసినప్పుడల్లా
మట్టి గంధం పూసిండ్రు
శకుని పాచికలకు
ధర్మాగ్రహ అస్త్రాలు సందించిండ్రు
కొత్త పోరాట రూపాల తెర లేపిండ్రు
ప్రయోజనాల యోజనాల దాటవేతకు
ధూం ధాం లై దద్దరిల్లిండ్రు
రెండు కళ్ళ సిద్ధాంతాల ఒకేవైపు చూపును
కందిరీగలై ముసిరిండ్రు
రాజీ పడి, రాజీనామాల దోబూచులాటలకు
ముళ్ళై గుచ్చని గులాబీలై ప్రణమిల్లిండ్రు
తలకు చోటు  లేదన్నప్పుడు
మరణానికి చోటుతో పాటు
సమయం లేదని నిరూపించిండ్రు
గమ్యం అగమ్య మైనప్పుడు

ప్రాణాల్ని పిడికిట్లో మట్టిలా ఎగజల్లింద్రు

అమరత్వం
స్తూపం మీద పాలపిట్టై వాలింది
మన ఇంట్ల, మన బువ్వ తింటున్నం
సరాన పడ్డప్పుడల్లా
మిమ్మల్నే తలచుకొంటున్నం

# మతం గురించే మాట్లాడుకుందాం

దర్గా మీద వాలిన కబూతర్
కంట్ల బుగులు
చార్మినార్ ను సుతిమెత్తగా తుడుస్తున్న
వెన్నెల నెత్తిన పిడుగు
మందిరంల త్రిశూలానికి  గుచ్చుకున్న
కంఠం పువ్వు
సిలువ చుట్టూ ముసురుకున్న
పాప క్షమాపణ పొందని ప్రార్థనలు

అయినను
మనం మతం గురించే మాట్లాడుకుందాం

బాబ్రీల
బాబర్ శిథిల మవుతున్నడు
అయోధ్యలో రాముడుండాడో
వనోద్దరణ కే తరలిండో
చర్చి గంటల 'గ్లోబల్ పీస్' ఎంత వినబడుతుందో

అయినను
మనం మత మహాత్యం గురించే  మాట్లాడుకుందాం

ఇరాన్ ఇరాక్‌ల శత్రు మేఘాల వేట
శ్రీలంకల జాతి వైరాల  కుంపట్లు
గుజరాత్ గాయపు సలపరింత
వరల్డ్ టవర్ బూడిద కుప్ప
లక్షింపేట క్రూరపు మచ్చ

అయినను
మనం మత విశ్వాసం  గురించే మాట్లాడు కుందాం

భుట్టోకు ఉరి ఆహ్వాన శాసనం
సద్దాం ఛావక తప్పని, కఠిన సంతకం
కసబ్, అఫ్జల్ ల ఆఖరి శ్వాసల ఖరారు
పార్లమెంట్ భవనం పై
ఒక ఉరితాడెప్పుడు వేలాడే...

పేర్లు, తేదీల ప్రకటన
వీలును బట్టి

అయినను,
మనం సర్వ సత్తాక  మతం గురించే మాట్లాడు కుందాం

భాగ్యం లేని లక్ష్మి
భాగ్యలక్ష్మి ఎందుకయిందో
గోకుల్ ఛాట్ కడాయిల
మాంసం ముద్ద లెవరేసింగ్రో
ఒకరి పండుగకు
ఒక రెందుకు  బంద్ పిలుపిస్తుంగ్రో
జెండా లోని త్రివర్ణాలు
రక్త వర్ణం గనే ఎందుకు కనిపిస్తుందో

అయినను
మనం మతం గురించే, భక్తి ప్రపత్తులతో
మాట్లాడుకుందాం

కడుపుల కలలు కన్నట్లుగా

పుట్టే బిడ్డకు అందమైన ప్రపంచ ముందది
మార్చురీ శవాలకు
నాలుగు సమిధల్లో కాలే
అదృష్టం పట్టది

ఏ ఆత్మ స్పందనల కింద
ఏ బాంబు అమర్చి ఉన్నదో
ఏ చరిత్రకు
ఏ తెర తీయబడునో

అయిననూ
మనం మతోద్ధరణ గురించే
అనర్గళంగా మాట్లాడుకుందాం

ఆనాటి రాజులు పోషించిండ్రు
ఈనాటి తరాజులు
పెంచి, పోషిస్తున్నరు
సనాతన ధర్మం హెచ్చరిస్తున్నది
ఆధునిక సమాజం భ్రష్టు పట్టిందని

అందు కందుకే
మనం మతం తప్ప మరోటి మాట్లాడకూడదు

కాదంటవా
నిన్ను ఉరి తీయాల్సిందే
అప్పుడు కూడా
మనం మతం ఆవశ్యకత గురించే
సంతుష్టంగా మాట్లాడుకుందాం

# అమ్మ సంతకం

మరచిపోయిన అమ్మ మళ్ళా మతిల కొచ్చింది
మరణించిన అమ్మ
ఆనాటి సంతకంలోంచి పుట్టుకొచ్చింది
వణుకుతున్న చేతివేళ్ళ మధ్య
పెన్నును బిడ్డలా పొదవుకొని
బతుకు మీది తీపినంతా
తన పేరులో రంగరించి
నా డైరీలో ప్రతిష్టించింది సంతకంలా

ఎవరూ వూహించి వుండరు
ఏ అవసరాల మేరకో
అమ్మ సంతకం చేసింది
సమాధుల చాటున అమ్మను పోల్చుకోలేక పోయిన
తన పాత సూట్‌కేస్ లోనే దృశ్యమానం కాలేకపోయింది
తిథి పెట్టినప్పుడల్లా
ఏ పదార్థం పైన వాలలేక పోయింది

దినాలు, దినచర్యలు
కాలం తోక పట్టుకుని వెళ్ళిపోయినా

డైరీ పేజీలు తిప్పుతూ
ముదనష్టపు మరపులోకి వెళ్ళిపోతున్నా
ఒక్కసారిగా ఆకాశమంత కళ్ళలో కొచ్చి
మెరిసినట్టుగా
అమ్మ సంతకం దర్శించిన
ఆ అపురూప క్షణాన
'ఎట్లా వున్నావమ్మా' అని అడగాలనిపించింది
చేతులందించాలనిపించింది ఎత్తుకొమ్మని
యోగక్షేమాలు అడిగినట్లనిపించి
నా గురించి, నా భార్యాపిల్లల గురించి ఏకరువు పెట్టాలనిపించింది

'గుర్తున్నానా'
అని తల పంకించింది కాబోలు
మాయదారి లోకం గదా
పేగుతో పుట్టిన నిమిషం వరకే
పేగు తెంపిన క్షణం తర్వాత
ఎవరికీ ఎవరు కానితనమే చొరబడ్డది

ఋణాల మాట దేముంది
అన్ని ఋణాలకు వడ్డీ కడుతున్నా
మెడ మీద కత్తి పడేనాడైనా తేర్పవలసిందే గద
అమ్మా, నీ ఋణం గురించి
ఎన్నడైనా ఆలోచించిన్నా
నువ్వే నాకింకొక గోరుముద్ద బాకీ వున్నట్టు
అనిపిస్తూ వుంటుంది
నాన్న పాత్రను, నీ పాత్రను పోషించీ, పోషించీ
అలసిపోయావనుకుంటా
ఏ పూట ఏం మాట్లాడాలో
తెలియని అపసవ్యపు గాళ్ళం

శారీరక నొప్పులకే జడిసిపోతం
బతుకునొప్పి గురించి నువ్వెంత చెప్పినా
అర్థం కాలేదప్పుడు

అనుభవం కావాలంటే అమ్మే కావాలి
ఓ అమ్మా !
ఆ స్వర్గంలో అతిథి మర్యాదలతో
హాయిగా వుండు
నేను నీ ఆరని సంతకం చివర్న ప్రణమిల్లి
సుఖంగనే...!

## ఏవో ఏవేవో

నిదరోయే అలల్ని
చక్కిలిగింతలు పెట్టి
మెలకువలో పరిపక్వమయ్యే కలల్ని
పుట్టించాలని వున్నది

తీరాన్ని దునుమాడి
గెలుపు రహస్యపు పిలుపుతో
విజయగర్వపు నవ్వుని
ఆహ్వానించాలని వున్నది

పాయల హొయల్లని
కథలు కథలుగా వర్ణించి, మైమరపించి
నా జటాఝూటమందు
ముడుచుకోవాలని వున్నది

కలంలా
తలను విదిలించి
గుడిసె ముందు 'గంగ' వెర్రు లెత్తించాలని వున్నది

పుట్టుగుడ్డు నిశిని
రెప్పల కింద అదిమిపట్టి
పొడుచుకొచ్చే నక్షత్రపు చూపు బాణంతో
ఆకాశాన్ని ఛేదించాలని
భళ్ళున తూర్పు
కనుపాపల విచ్చుకోవాలని వున్నది

ఊగిసలాడుతున్న
పడవను బద్దలు గొట్టి
లోతైన అడుగుని
కాలి అడుగుతో తన్ని
నదిని బాహువుల్లో ఇరికించుకొని
పొగరెక్కి పయనిస్తూ వున్న

ఈ సారి నదిని
పద్యం చేసి గాని వదల్ను

అదే చూసుకుంటది అన్నిట్నీ –

# ఒక్క మాట

నాలుగంటే నాలుగే అక్షరాలు
రెండే రెండు  పదాలు

ఎంత సునాయాసంగా అనగలిగావ్

ఏజ్  ఫాల్ట్...!

వయసుల మధ్య అంతరాల్నే చూశినవ్
ఆత్మ కొట్టుకునే తీరును
కంపరమెత్తిన నువ్వు కనిపెట్టలేకపోతవ్

విసుగెత్తిపోతవ్

ఏళ్లుగా అల్లుకుపోయిన స్నేహబంధాల్ని పదే పదే
చేతిమట్ట మీద బెల్లంలా
నాలుకను తీపి చేసుకుంటుంటే

కళ్లెర్రబార్చుకుంటవ్

దులిపిందే దులుపుతూ
తుడిచిందే తుడుస్తూ
ముడత తీసి, మడత పెడుతూ

శ్రమ సౌందర్యాన్ని అపురూపం చేస్తుంటే

ముఖాన్ని ఉడికించిన కందగడ్డలా జేవురిస్తవ్

నీవు కత్తిరించి చేసిన డిజైన్ లో
పచ్చీస్ కాయలా వుండనందుకు

తన ఆరోగ్యానికి నీ మాట
మందు అవదు
తన ఆకలికి నీ రుచి నంటగడతవ్
నీ వాదన తనకి వేదన

ఇందాక వచ్చిన నీ పడుచు వయసుకు
ఎందాకో మోసిన బతుకు ముడతల్లో
దాచిన చెమట స్మృతుల ముడి విప్పగలిగావా
ఎపుడైనా

ఊయలూపుతూ నిదురని
కళ్ళరెప్పల కిందే నిలిపేయడం
గుర్తు లేదా
ఎదగడానికి ఎదమీద ఎగరేసిన
సన్నివేశం మరచినవా
దిద్దే అక్షరం కోసం
పది పలకలై పగిలిపోయినప్పుడు
చూడలేదా
పట్టుజారి పడిపోతున్నప్పుడు
పట్టుకొమ్మై నిలిచింది
తెలియదా
ఎన్ని కోరికలు చంపుకుంటేనో

నీ కోరికలు తీరినవో
ప్రేమనా, అనురాగమా, అభిమానమా,
ఇష్టమా, బాధ్యతా
త్యాగమా, ఇంకేమన్నానా,
లేకపోతే ఇవన్నీనా

జిహ్వా రుచులకు అలవాటు పడ్డాక
మనసు రుచులెట్లా తెలుస్తయి ?
సంసారమంటూ ఏర్పడ్డాక
ప్రేమ పరిధులెట్లా కురుచవుతయి ?

ఏజ్ ప్రయాణంలో స్టేజ్ లెన్నో
దాటేస్తూ వుంటవ్
మోకాళ్ళ మీదికొచ్చిన జీవితం
ముందుకు కదలక మొరాయిస్తది

అప్పుడు
నువ్వన్న మాటే
నువ్వినవలసి వస్తుందేమోనని
భయపడుతున్నా !

తొందరపడి ముందే కూసే కోయిలలా
జోరువానకు సిద్ధమైన ఆకాశంలా

ఒకసారి
మనసులో కలవరపడి చూడు

# నేను

మందార మకరంద మొలికిన
పోతన భాగవతాన్ని
పల్నాటి పౌరుషత్వాన్ని ప్రస్ఫుటించిన శ్రీనాథ
వీర కావ్యాన్ని

ఎవడబ్బ సొమ్మని నిగ్గ దీసిన
రామదాసు కీర్తనని
పాలబుగ్గల దొర్లిన కన్నీటి చారికల
సుద్దాల పాటని

తిరగబడ్డ పొద్దోలె ఎగబడ్డ
సురవరం తౌరక్యా ంధ్రని
పరభాషా సకిలింపుల అదిలించిన
కాళోజి గొడవని

కోటి రతనాలతో మెరిపించిన
దాశరథి గాలిబ్ గీతాన్ని
గట్టి కోటల గ్రంథాలయ
వట్టికోట మూటని

మణులను తవ్వి తీసిన
బిరుదురాజు జానపదాన్ని

పైస నోచని  రైతు గోసల
వానమామలై బుర్రకథని

ఒద్దిరాజు సోదరుల బుద్ధి చతురతల
అచ్చెరువుని
పాములపర్తి అనువాదాన్ని,
గొల్ల రామవ్వ తెగువని

ఒగ్గు కథల మెరిసిన చుక్కా అల్లీ రాణి ని
గద్దర్ ముద్దాడిన వీరున్ని,
సంధించిన పాటల తూటాని

జయశంకర్ ప్రసంగాన్ని
జ్వాలాముఖి ప్రాసంగికాన్ని
అందెశ్రీ అనవరత జయకేతనాన్ని
గోరటి సంచారమే ముద్దైన బతుకుని

ప్ర 'పంచ' పదుల నదుల మీద
విహార కర్పూర వసంత రాయలని
మౌనంతోనే అల్లిన చంద్రబోస్ రణకట్టు పదాల
అలుపు లేని గెలుపుని

అవునూ
నేను తెలంగాణ నీ
తెలుగు మాగాణి నీ
ఎన్ని భాషలైనా వుండనీ
ఎప్పటికీ, ముమ్మాటికీ  మహారాణి నీ

# దృశ్యభ్రమణం లోంచి

అట్లా నడుస్తుంటానా

మూల మలుపు తిరగ్గానే
సూర్యుడెదురుపడి ఆలింగనం చేసుకుంటడు
రోడ్డుమీది పేపరొకటి ఎగిరొచ్చి నా ముఖానికి అతుక్కుంటది
మిత్రుని కవిత అచ్చయిందేమో
అడుగు తీసిన్నో లేదో
ఎప్పుడొచ్చిందో నా కాళ్ళచుట్టు అల్లుకుపోతుంటదా  కుక్కపిల్ల
ఏమంత తినడానికి పెట్టినానని
ఇంతలో వెనకనుంచి నిద్రలేపే కోడిపుంజు లాంటి కరుకైన పిలుపు
నన్ను గుర్తు పట్టే, గుర్రుమనే ఆపాత మధురమైన గురువర్యుని
గొంతుదే

దుకాండ్లు తెరుస్తున్నరు
పోటీలు మొదలైనయి
అమ్మడం, కొనడం గొప్పపని కిందే లెక్క
ఎవలకు వాండ్లు బతకడానికి ఏర్పాట్లు చేసుంటున్నట్లే
500 నోటుకి చిల్లరెవరిస్తరు ?
ఆ మిల్క్ బూత్ లో అడగొచ్చా
పాలలాంటి మనసుంటుందా వాడికి

రోడ్డు రన్నరై దూసుకెల్తున్నది
అడుగులు పడుతున్నా అక్కడే కూలబడ్డట్లున్నానా

అన్ని ధ్వనుల దాడిల అంతరంగ సంభాషణ
ఇవాల్టి సినిమా సాంగ్ లా, ఎవరికీ పట్టని లిరిక్కయింది
ఆ గుడిదగ్గర భక్తుల కోలాహలం
అసంతృప్త జనాభాని, నమోదు చేసుకుంటున్నాడా దేవుడు
బిచ్చగాడా చెట్టుకొరిగి కునుకుపాట్లు పడుతున్నడు
ఈ మాయామేయ జగంబుతో పట్టి లేనట్లు –

కాలుకింద కంకరముక్క గుచ్చుకొని, అమ్మని తలచుకొంటానా

సున్నితపు త్రాసుల శెక్కరి తూచుతూ
కరెన్సీని కఠినంగా వసూల్ చేస్తున్నడు ఆ షాపువాడు
స్కూల్ గేట్లోకి వెళ్ళక, చదువులమ్మి హతం చేస్తున్నది
రోబో గ తయారవ్వడం ఇష్టం లేక –
ఈ పాటను కాపీ చేసుకొమ్మంటూ
జేబులో సెల్ అరుస్తున్నది
ఒనరూ నెనరు దానికి పట్టదు
వలస వచ్చిన ఆ వృద్ధ దంపతులు
వీధి మూలన మిర్చి బజ్జీలు వేసి
అమ్మకానికి ఆశతో చూస్తున్నరు
వయసై పోయినందుకు శిక్షింపబడాలేమో

నడుస్తున్నానా, ఆలోచిస్తున్నానా, ఆవేదిస్తున్నానా

కొంచెం ఆకాశం మేఘమయమై
కంట్లో వాస్తవమేదో కనుమరుగైనట్టు
శూన్యావరణలో నేనొక్కడినే కట గల్సినట్టు

డేట్ల గేట్లు దాటుకుంటూ పోవడమే
నుదుటి ముందు సూర్యుని లాంటి ఉనికేదో
ఉదయిస్తూ ఉండాలనుకోవడం నుంచి
పారిపోవడమే

పరిశుభ్రమైన గాడ్పులు వీస్తూ
మనసుల్ని గిలక్కొట్టి, వెన్న తీస్తున్నట్లు కలలొస్తుంటయి
ఇప్పటికీ

కలల్ని ప్రచారం చేయడం
బాగుంటుందేమో
నడకకు గమ్యం దొరికే అవకాశం
ఉంటుందేమో

# మృత్యు గానం

మృత్యుఘంటికలు మోగినప్పుడల్లా
జీవితం ఉలిక్కిపడుతది

ముందర అడ్డుపడే భూతం లానో
వెనక వెన్నంటివచ్చే వెన్నుపోటు లానో
కుడిచేతి పక్కనుంచి ఓటమి సంఘర్షణ లానో
ఎడమవైపు మూలనుంచి జీవన శిథిలం లానో

మృత్యు దర్శనం
మరెన్ని వేషాల్లోనో

సాగదీసిన కంటిరెప్పల మధ్య
వదులుగా వేసిన పాదముద్రల మధ్య
ధూళి ధూసరం నిండిన ఆకాశానికి భూమికి  మధ్య
ఖాళీ వుంచావో
మృత్యువు దురాక్రమిస్తది

నిజానికి, మృత్యువు
స్నేహశీలి
ప్రేమమయి

దిగమింగలేని  దుఖంలో మునిగినప్పుడు
జీవితం  మొత్తానికే రద్దనుకొన్నప్పుడు
ఒళ్లో పెట్టుకుని, సేద  తీరుస్తది

ఒక్కోసారి కర్కోటక విరోధి కూడా –

వయసూ వరసా లేకుండా
పదే పదే వెంటపడి  తరుముతుంటది
సొంతమైన బతుకును
సొంతం బతుకనీయకుండా
అక్షరాన్నొక పద్యంగా మలుచుకోనీయకుండా

జననం మరణం
రెండు పార్శ్వాల జీవితం
ఒకదాన్నొకటి  అనుసరించడమో
          పోటీ పడటమో
మృత్యు సంగీతానికి
పడగెత్తిన పామై ఆడుతూ
ఓడిపోవడమో
ఓడించడమో

మృత్యువు చేతిలో
నిండు నూరేళ్ళ బతుకును పొట్లం కట్టి, పెట్టి
మాట అడుగుతున్న
కాపాడుకొమ్మని...

# పిలుపు

నెత్తి
తెల్లాకాశం
నోరు
పండ్లూడిన నిశిగుహ
మింటి నంటని
కంటిచూపు
చెవిటి సైర
వెలిసిన ఇంద్రధనుస్సు
వంచిన వెన్ను
మోకాళ్లమీదే
భూగోళం
వేలెత్తలేని కరబలం
కర్రబలమే

వెరసి
శిథిల దేహ దేవళం అవ్వ

గేటు తోసిన –
ఎవరు బిడ్డా
బాగున్నవా !

చెవిలో అమృతం
మనసులో వెన్నెల

## ఆవిష్కృతం

ఒకే ఒక్కసారి
అంత మాత్రమే

తలుపు తట్టి, రా

మూలకు మాగేసిన
స్వప్న రోచిస్సుల దొంతరలున్నయి
– ఒక కలకి రెక్కలు
  తొడుగుదువు గానీ

ప్రియమైన పిలుపుతో  పిలిచి, రా

ఊరేగుతున్న ఊహా సంబరాల
ఉక్కిరి బిక్కిరులున్నయి
– ఒక మధురోహతో మృదువుగా
   సంభాషిద్దువు గానీ

లయ తప్పని అడుగుల ధ్వని
ఆగకుండా, రా

వేల ప్రయాణపు మజిలీల

ఉద్యమ తంత్రుల స్మృతి చారికలున్నయి
     - ఒక జ్ఞాపకాన్ని మీటుతూ
     కొత్త రాగాన్ని పలికింతువు గానీ

కలివిడి వాంఛానందంతో, రా

పువ్వై విచ్చుకున్న గాఢాలింగనాల
సౌరభ శ్రేణులున్నయి
          - ఒక పరిమళ సానువు పైకి
          లంఘింతువు గానీ

ఆకలి తీరని ఆశతో, రా
మంచి నీళ్ళ గ్లాసు
వడ్డించిన విస్తరి
చేతులు కట్టుకుని ఎదురు చూస్తున్నయి

పరిపక్వపు పాట తెమ్మెరతో పాటు

వస్తూ వస్తూ
ఇన్నన్ని రక్తమంటిన సందర్భ పదబంధాల్ని
మోసుకొని, రా
బహుమానంగా ఇక్కడ పంచిపెడుతువు గానీ

నువ్వొచ్చి, వెళ్లినట్టు
గుర్తు కోసం -

తొలి వేకువ సౌందర్యం లోనో
నడిజాము  భయదాంధకార వికారంలోనో
కొన్ని గంటల శక్తి చాలని నిరీక్షణ లోనో

– ఒక ఘడియ రెప్పమూయని
విరామంలోనో

వస్తావేమో !

ఇంకా
ఈ పద్యం
ఆవిష్కరింప బడలేదు

# అమ్మాయి వెళుతోంది

నా ఇంటిని నా ఇష్టానికే వదిలేసి
సర్దిన తీరులో తన ఇష్టాన్ని ముద్దరేసి
కాలానికి నా ఎదురుచూపు లానించి
అమ్మాయి వెళుతోంది

**1**

గుండెల మీద ఆడినప్పుడు
అ ఆలు నేర్చుకోవాలన్నానేమో
వీధిలోకి ఉరికినప్పుడు
పట్టుకుపోయే టోడొస్తాదన్నానేమో
చంక నెక్కి, చందమామను చూపినప్పుడు
తెచ్చిస్తానని, మాట తప్పానేమో

**2**

రెండు జడలు వేసుకొన్నప్పుడు
పేరొందే కవయిత్రి కావాలని అని వుంటాను
అక్క చున్ని వేసుకొని, గొడవ పడినప్పుడు
అక్క దిక్కే మొగ్గు చూపి వుంటాను
సినిమాల మోజు చూపినప్పుడు
సమాజం చర్చ చేసి వుంటాను
అమ్మ ఒళ్లో తల పెట్టి, గొప్పలు పోయినప్పుడు
'నా వాటా ఏమీ లేదాని' ప్రశ్నించి వుంటాను

**3**

విద్యార్హతను ఉద్యోగంతో తూచ ప్రయత్నించానేమో
టాలెంటే సర్వాధికారి, సర్వాంతర్యామి అయినప్పుడు
వీక్ పాయింట్ దగ్గర వీక్ నెస్ ని రెట్టించానేమో
సెల్ చార్జింగ్ కు కరెంట్ కోతలున్నట్లు
సెల్ రీచార్జీ లకు రూల్స్ పెట్టానేమో
రుచులను, అభిరుచులను
బ్రాకెట్లో బంధించానేమో

**4**

కాబోయే సరిజోడును
కలల వూహల్లో కొలుస్తున్నప్పుడు
అతిశయోక్తి నుచ్చరించి వుండొచ్చు
వయసు దాటుతోందని
ఆప్షన్ల సంఖ్య కుదించి వుండొచ్చు
కాలం కఠినంగా గడుస్తోందని
హెచ్చరికలు చేసి వుండొచ్చు
తన కాలం కఠినంగా గడుస్తోందని
కన్ను ఒత్తిగిల్లిన సంగతి
కని, విని వుండకపోవచ్చు

**5**

అమ్మాయి వెళుతోంది
ఈ భూమి నుంచి ఆ భూతల స్వర్గానికి
డాలర్ల పక్కన చేరిన ఆయన సందిట్లోకి
తను ఏమడిగినా
సృష్టించైనా ఇవ్వడానికి సిద్ధమైనా
తను పూదిచ్చిన ఇంటిని
చిటికెన వేలుతోనైనా మలుపకుండా
వుంచడానికే నిర్ణయించినా

6

అయ్యా చేతిలో తనను పెట్టినప్పుడు
చేతులతో పాటు మనసూ వణికింది
అరుంధతి నక్షత్రం చూపించినవాడు
అమెరికా రమ్మంటున్నడు

పెళ్లి రోజున
నా ఇంటి గడప కడిగి
కడుపు తడి చేసి
కని, పెంచిన  ఋణం తీర్చుకుని
అమ్మాయి వెళుతోంది

**7**

ఋణాలను తేర్పు కోవచ్చు
ప్రేమలను తేర్పుకోవడ ముంటదా !

# వెనక్కి తిరిగి

ఉదయాన్ని చూసినప్పుడల్లా
నిద్ర పట్టని రాత్రుల కలల కలవరింతలు
గుర్తొస్తయి

పూల వాసన సోకినప్పుడల్లా
పాదుల తల్లడిల్లిన తల్లివేరు తపనలు
వినిపిస్తయి

పక్షి పాట పసందుగ తోచంగనే
వాడిన వసంతాల ఆకుల గలగలలు
గాల్లో కొట్టుకు రావడం కనిపిస్తది

వానమబ్బుల ఆకాశం ఎదురైనప్పుడల్లా
పెదకాపు ముఖంలో
తుమ్మలు మొలిచిన దోడు దోడైన ఊరు
దర్శనమిస్తది

పండుగల సంస్కృతులు పలుకరించినప్పుడల్లా
యాడాదికోసారంటూ ఇంటింటికి
తిరుగుతూ అడుక్కునే పనిపాటలోళ్ళ
గంపల నిండిన తిట్లు
గుండెకు తగుల్తయి

మజిలీలు వెన్నెల తోవలై
ఆహ్వానిస్తూవుంటే
పొత్రాయిలు తగుల్తూ
బతుకు చెమటై కరగడం తెలుస్తది

గతమెంతో ఘనకీర్తి గలవాడెవడో గని,
ఎట్లచ్చిందో గని
కావడికుండల్లో కష్టాల్ని భుజాన మోస్తూ,
నడుమొంగిన నడకే
పుట్టువడి
కాసును చూడని దరిద్రపు కళ్ళే గనక
అడుసు తొక్కిన నేలను వల్లె వేసుకోవడం
మరువని మురుసుడది

ప్రతి సుఖం వెనుక
ఒక దుఃఖపు జీర
లీలగా
కదలాడుతనే వుంటది

# యుద్ధ వాంఛ

పువ్వులో మందుగుండు నింపి
ట్రిగ్గర్ నొక్కుతా
పసినవ్వుల 'గాజా' దృశ్యం
పట్టన పగిలిపోనీ
కోకిల గొంతులోంచి ఒక తూటా పేలుస్తా
గేయాలకు గాయాలై
రక్త విలాపన చేయనీ
పురివిప్పిన నెమలి పింఛం లోంచి
ఒక బాంబు విసురుతా
రంగస్థల వేదిక
రణరంగస్థలి కానీ

నేను యుద్ధ పిపాసిని
నా ద్రవ్య సంస్థ, సార్వభౌమాధికార వ్యవస్థ
బ్రహ్మజెముళ్ళకు
గుచ్చుకుని, విలవిలలాడుతున్న
ఇరాక్, లిబియా, పాలస్తీనాల ఓటమిలో
నేను మరింత పొగరెక్కుతున్నాను

నా ఇష్టానికి మతమొక తోడు
నా వాదానికి ఐక్యరాజ్య సమితి మౌనం తోడు
గుజరాత్ ఊచకోతకు, కశ్మీరీ  పండిట్ల వెలివేతకు
జరిగిన, జరుగుతున్న, జరుగబోయే
అల్లర్లను, పరాకాష్టకు తీసుకెళ్ళేందుకు
నా పెత్తనం మద్దతు ప్రకటించే వున్నాను

సరిహద్దుల్లో సైనికుడు కాల్చబడనీ
ఫోటో పెట్టి, వీరమరణంగా కీర్తిస్తాలే
క్షిపణుల సెగలతో భూమి పొరలు వేడెక్కనీ
బటర్ ఫ్లైలు, వానపాములు గిలగిల కొట్టుకోనీ
తాగే జలం లో రసాయనికం పొంగనీ

సింహాసన స్థాపన జరిగిందా లేదా
అనేదే నాకు మిలియన్ డాలర్ల ప్రశ్న ?

సభ్య సమాజానికి
ఆధునిక నాగరికతకు
ఒక మేధావి తలకు
మరొక శాంతి దూతకు
అవార్డు ప్రకటించి పెడతాలే

మత్తు గొలిపే ప్రతిఫలమది
నిరసన నీరసంగానే ముగుస్తది

నేను  త్రికరణ శుద్ధిగా యుద్ధవాదిని
అగ్రరాజ్య ఉగ్ర స్వరూపాన్ని
వందేళ్ళు కానీ
ఇంకో వందేళ్ళు పోనీ

చందమామ ముద్దు మోమున
ఒక ప్రపంచ యుద్ధ బంకర్‌నీ నిర్మిస్తా
ఆకాశం, నేలా
నా పాదాల చెంత
ఎప్పటికీ మోకరిల్లాలె

# కవిత్వమే

ఒక్కసారి కవిత్వాన్ని ప్రేమిద్దామా !

కలలో నడుస్తూ, మెలకువని చేరుకుంటం
జ్ఞాపకాల బరువులోంచి తలెత్తి, సూర్యోదయాన్ని తిలకిస్తం
గాలి గాలిగా  కదిలే ప్రాణవాయువుని, ప్రాణప్రదంగా
ప్రాణ ప్రాంగణం లోకి ఆహ్వానిస్తం
కన్రెప్పల మీది దృశ్య పరంపరని కళ్ళలోకి ఒంపుకొంటం
దురూహల దేహభాష అమాంతంగా రద్దయి,
మనసు కొత్త భాష కోరుకుంటది
చెదిరిపోయిన మేకల గుంపు లాంటి అక్షరాల  కోసం,
వెదుకులాట మొదలైతుంటది
సంభాషణ ఆగిన వేళ తో, మళ్ళా ముచ్చటిస్తం
రక్తమంటిన కరవాలంలో, హృదయ గోష వింటం

ఒక్కసారి కవిత్వంతో సావాసం చేద్దామా !

గోటీలాడుకునే  పిల్లలకు, బొద్ది తవ్వి పెడుతుంటం
బెదిరిపోయే మేఘాలకు, ఆకాశమంతటి ధైర్యానిస్తుంటం
ఆకురాలిన చోట, శోక శకలాలను వెలికి తీస్తుంటం
చంద్రవంకకి ఉయ్యాల గట్టి, ప్రకృతిని ఊపుతుంటం
పొడిబారిన మట్టితో, తడిగీతం అల్లుతుంటం

అలలు ఎగిరిపడుతున్న నదిముందు నిలబడి
గెలుపుని ఆవాహన చేసుకుంటం

ఒక్కసారి కవిత్వాన్ని రాద్దామా !

కాలాన్ని, యుద్ధాన్ని వొదిలేస్తం
మనల్ని మనం మరిచి పోతం

ఒకే ఒక్క కవిత్వమై మిగులుతం

# పాలించవె బతుకమ్మ

ఇత్తడి తాంబాలంల
బీరాకుల పొత్తిళ్ళల్ల
మూడు వేళ్ళ ముద్దగౌరమ్మ మురిపెంగ
పదారు కళల కాణాచి
కొలువు తీరిన బతుకమ్మ

చెల్కల గునుగు దూసి
గుట్టల తంగెళ్లేరి
తిరిగి తిరిగి
పట్టుకుచ్చుల పువ్వుల పట్టి

ఎన్ని అరచేతుల ఏక ధ్యాసపు పొందికో
ఎంత సబ్బండ వర్ణాల సాంస్కృతికాస్తిత్వ ప్రతీకో

అత్తగారింట్లో అడుగు పెట్టినా
పుట్టింటికి పుట్టెడు పండుగను
మోసుకొచ్చే ఆడపడుచు కట్నమిది
ముద్దుగుమ్మల ఉయ్యాల పాటల
చక్రబంధం లాగే
భూమి గుండ్రమే
బతుకమ్మ గుండ్రమే
రాగరంజితమైన ఆత్మల మేళవింపుల
అలయి బలయి అద్భుతమే

కన్యా సుకుమారి బొడ్డెమ్మ
తొలి ముగ్ధ స్నిగ్ధ వలపుల కలికి  బతుకమ్మ
నిండు చూలాల పసుపు వన్నెల జవరాల బతుకమ్మ
కుంకుమ కాంతుల నుదుటి బొట్టంత
పెద్ద ముత్తయిదువా బతుకమ్మ

కోర్కెలు మొక్కులు నైవేద్యాలు
ఆశలు గీసిన ముగ్గుల మీద బతుకమ్మ
మౌనంగా గానంగా స్వీకరిస్తూ –

తొమ్మిదొద్దుల్లల్ల
తీర్ల తీర్ల పూల వర్ణాల
ఇంతింతై, అంతంతై, బతుకంతా అయి –

మోస్తున్నందుకు నేల
చూస్తున్నందుకు నింగి
సంస్కృతి ఆరాధ్యంలో పులకిస్తూ !

చేతిగాజుల ధ్వనులతో
కదిలే అలల మీద కదులుతూ
'పోయి రావమ్మా బతుకమ్మా
మర్నాటి యేటికి మా ఇంటికి రావమ్మా'
సాగనంపే సంతుష్టమైన పాటకు,
'పలారం పంచుకు తిని,
పచ్చంగుండుండ్రి'
సద్దుల బతుకమ్మ దీవెన
చెరువంతా ప్రతిధ్వనిస్తూ
ఊరంతా పరిమళిస్తూ ...

# కొన్ని ప్రశ్నలు - ఒక ముగింపు

గడ్డ మీద నిల్చుని
నది మీది ప్రతిబింబాల అంతరంగాల్ని
కొలవగలమా ?
అడుగు ముట్టాలేమో
చెట్టు చిగురాకు కొమ్మ కొసన వూగుతూ
రంగుల హరివిల్లు మీద
వాన చినుకులై కురువగలమా ?
మబ్బులో మూగాలేమో
దారివెంట పోగొట్టుకున్న వెండి కలలతో
అదేపనిగా
తనలో తనుగా
గులుగుతూ పోగలమా ?
ఎలదేటి పాటొకటి
వెంట రావాలేమో
శత్రునిర్మిత సుదీర్ఘ రాత్రుల
తీరమైదానాల్లో
ఒక్కడిగా నడువగలమా ?
అల్లుకున్న పదసైన్యాల గూటిలో
ప్రమత్తంగా కన్ను మలపాలేమో
అడివినంతా గాలించినా
ఏ కూత యే పక్షిదో

ఏ ఆకు కన్నం యే విలుకాడు చేసిందో
కనిపెట్టగలమా ?
జకముక రాపిడిలో
గిరిజనుడై పోల్చాలేమో
సైకతచ్ఛాయల
నిదుర విహారంలో
సుఖానందాల సముద్రమట్టాన్ని
స్పృశించగలమా ?
గోర్వెచ్చటి కలై దూరి,
గిలిగింతలు పెట్టాలేమో

ఏ తొవ్వ
ఎన్ని మలుపుల మెలికల విరిగిపోతుందో
దూసిన బాణం పుల్ల
ఏ రణరంగాన్ని అంగాంగాలుగా దునుమాడుతుందో
సిరా జల్లిన తెల్లకాగితం
ఏ ఆకాశ వరమై ఎవరికై అవతరిస్తుందో
ఇదమిత్థంగా చెప్పగలమా ?
ఖరాఖండిగా తేల్చగలమా ?

అలవికాని అపురూపాపేక్షల
ఒడిసి పట్టుకోజాలని సాహస క్రియా విన్యాసాల
పదిపదుల పరిపూర్ణ జీవితాన్ని
అన్ని వైపుల్నుంచీ
ఆక్రమించుకుంటే తప్ప

# కాన్వాసు పై దృశ్యం

దండెం మీద దడి కట్టిన
రామచిలుకల ఆకుపచ్చ వాక్యం
బొద్దు ఆరుద్ర పురుగుల ముద్దు పరుగుల
హారిద్రవర్ణపు పుప్పొడుల నేల
తెలివెలుగు మంచులో పూల చుట్టూ
పద్యాలు చుడుతున్న గండుతుమ్మెదలు
చంద్రవంక వంకీకి చిక్కక ఎన్నీల రాకెట్లయి
ఆకాశమంతా ఎగుర్తున్న దువ్వెనలు
పుస్తకాల గనిలో మధురాక్షరాలను
నములుతున్న సిల్వర్ ఫిష్‌లు
అగ్గిపెట్టెల్లోంచి ఎగిరిపోయి
బంతాకులు నెమరేస్తూ
కలల్ని వెదజల్లుతున్న బంగారిపురుగులు
హరివిల్లు లోంచి రంగులను తెచ్చి
పూలతోట కద్దుతున్న సీతాకోకలు
తేనెబొట్లతో అమృతపు గూడు కట్టి
మరిచి, వెళ్ళిపోయిన కందిరీగలు
చేర బిల్చుకొని, కూడ బలుక్కొని
ఐక్యతా బాట నిర్మిస్తున్న ఎర్రచీమలు

మట్టిని సుగంధంగా మార్చటానికి
మల్లగుల్లాలు పడుతున్న నత్తగుల్లలు
సిల్కు దారాలతో ఇళ్ళను
రంగవల్లికలుగా దిద్దుకొంటున్న సాలీడు
గట్లమీద   గొల్లభామలై
గంతులేస్తున్న గడ్డిచిలుకలు

నేను కూడా
ప్రకృతి గీసిన ఛాయాచిత్రంలో
కనబడుతూనే వుంట
చెట్టు కొడుతూనో
ఎంగిలిచేత్తో కాకిని తోలుతూనో
కుండీలో నాటిన మనీప్లాంట్ చిగురుకు
మురిసిపోతూనో...

## మరొక అక్షరం

సియాసత్ సంపాదకీయం
సంతాప గేయం అయింది
ఇస్లామీ హిందూమత మేళవింపులో
సూఫీ ఫకీరువై సాయుధ  కవిత్వాయుధం
మోసినవు
రజ్వీ, జంగ్ లకు తురుం ఖాన్ అయినవు
మార్క్సిస్ట్ పాఠాల్లో మానవత్వపు
మనిషిగ ధ్వనించినవు

పురానా పూల్ పులుకు పులుకు గా చూస్తున్నది

కుడి ఎడమల అతివాద పోరాటమే చేసినవు
'శాయరోంకా కార్నర్'లో కుర్చీలు, టేబుళ్లు
నీ కవిత్వపు  ప్రేమికులే
హక్కుల ఉద్యమంలో అస్తమించని
ప్రథమాధ్యాయానివి

పాతబస్తీ దర్వాజ శోక సంద్రాన్ని మోస్తున్నది

దర్గాల మత్తవలివే
మఖ్దూం సోపతిలో కమ్యూన్ ఇష్టుడైనవు

జర్నలిజం, మార్క్సిజం, మానవ యిజం
నీ చేతనావరణం
నమాజ్ ని కాదని, సమాజ్ ని చదివిన
జకాత్ సంప్రదాయానివి

దర్గా మీద పావురం అవనతం అవుతున్నది

గొల్లతల్లి పోషణలో
ప్రజల కాపరి లక్షణం నేర్చినవు
కొండపల్లి వెంట నడిచి
అడవి గుండెల్లో కొలువైనవు

పౌరహక్కుల ఖాన్‌దాన్ వి
బహు దూరమైనా, చెవిలో వినిపిస్తున్న
ఆవాజ్ వి

# వాళ్ళు గనక

వాళ్ళు వస్తామన్నారు
సంబంధం లేకున్నా
సంబంధం మంచిదని
బంధం ముడి పెట్టి, బంధువుల మైదామన్నారు

వాళ్ళు వస్తున్నామన్నారు
కాళ్ళుచేతులు వణకడం మొదలైంది
గొంతెండిపోయి, దప్పిక ఎక్కడో తప్పిపోయింది
సెల్ ఛార్జింగ్ లో పెట్టి, మెదడు స్విచ్చాఫ్ అయింది
శరీరానికి  భూకంపం వచ్చినట్లుంది
ఇంటిని సర్దడం, ఫాస్ట్ రివైండ్ మెథడ్ లో
జరుగుతున్నట్లుంది
వాళ్ళకి అడ్రస్ తెలియడానికి
అక్కడక్కడా నా ముఖచిత్రాల్ని అతికించి వచ్చాను
కాలం దేం  గొప్ప ?
నా గుండె వేగానికి కళ్లెం వేయలేక పోతుంది
ఇంటికెవరొచ్చినా త్వరగా వెళ్లగొట్టుమని
దేవుళ్ళని వేడుకొంటున్నా
ఎన్ని కాల్స్ వచ్చినా ఏ కాల్ నా జీవితాన్ని
మార్చబోదనుకుంటున్నా

తినుబండారాలు, మర్యాదలు రాసుకుంటూ, కొట్టివేసుకుంటూ,
నచ్చునా, నచ్చవా
చిత్తు బొత్తు వేసుకుంటున్నా
ఏ హారన్ మోగుతున్నా
హైరానా పడుతున్నా
పెళ్లి సీన్ల ఎపిసోడ్ లను మనసులో
అప్లోడ్ చేసుకుంటున్నా
మాట, నడక, హావభావం, మెల్లని నవ్వు,
ఇత్యాదుల స్క్రీన్ ప్లే పకడ్బందీగ తయారు చేస్తున్నా

వాళ్ళు దగ్గరి దాక వచ్చారు
గాలో ఏమో చెప్పి, గాబరా పెంచింది
అడుగుల సవ్వడి వినిపించి
మా శరణార్థుల శిబిరం అలర్ట్ అయింది

నమస్కారాల పురస్కారాలతో
పరామర్శల పన్నీరుతో
ఆహ్వానం, అంగరంగ వైభవంగా ముగిసింది
కారప్పూస తిని, తీపిగా మాట్లాడినారు
పాలకోవా రుచిచూసి, తెల్లటి మనసు ప్రదర్శించినారు
చూడగలిగినవన్నీ చూసారు కళ్లారా
అడగగలిగినవన్నీ అడిగారు నోరారా
ఇరువురం ఒకరమే
మిగిలింది సుముహూర్తమే
సంకేతధ్వని వినిపించి, వెళ్లారు
'ఆనందం అర్ణవమైతే' అని ఏదో అంటారు
ఒళ్ళంతా పులుముకున్నాను
మంచిరోజులన్ని మాయింట్ల నివాసముండడానికి
టర్నింగులు తీసుకున్నాయని

కనుకొలుకుల చెమరించాను
ఏర్పాట్లు, కట్టలు తెంచుకొన్నాయి
షాపింగులకు, షాపులే బిత్తర పోతున్నాయి
బంధువులు, స్నేహితులు
గొప్పపని చేస్తున్నావని
పార్టీలు వసూల్ చేస్తున్నారు

తేదీ ప్రకటన కోసం వాళ్లకు ఫోన్ చేశాను
నా వాయిస్  కవరేజ్‌ని  రీచ్ కాలేదు

పెళ్లి, పెళ్లి పత్రిక లో ప్రింట్ కాలేదు
పెళ్లి పిల్లలు, పెళ్లి పీటలదాకా నడువలేదు

పరిచయ వేదికలు ఎక్కడ
కిటకిటలాడుతున్నా
అప్లికేషన్ కొరకు లైన్లో నిలబడుతూనే వున్న

# కల

కల గనడం అద్భుత ప్రక్రియే
పుల్లా పుడకలతో పక్షి గూడల్లినట్టు
అలల మీద వెలుగు నురగ తేలి పోతున్నట్టు

నిదురంటని సుదీర్ఘ రాత్రుల ఘర్షణలో
పొడుచుకొచ్చే వేగుచుక్క కల

పాదాలరిగిన ప్రయాణంలో
అలుపు సొలుపుల పోరాట పటిమలో
కల పరిఢవిల్లుతది

కల ఎవరి సొంతమూ కాదు
పేటెంట్ హక్కుల్లేనిది

ఒకరి కలలోకి ఒకరం
నిరాటంకంగా దూరిపోవచ్చు
కలల కాపురంలో ఓలలాడవచ్చు

ఏమీ లేకున్నా
కలా స్పృహతో వున్నావనుకో
నీ రుజాగ్రస్త శరీరం
కలా కాంతులీనుతది

కలకు పునర్జన్మ లుంటయి
ఆరాటపడే ఆఖరిశ్వాస నుండి
పురిటి శ్వాస పీల్చుకుంటది

ఏ పూర్వీకుని కలో
నీలో నాలో మనలో
మొగిలిపువ్వై విచ్చుకుంటది

కల గనడం ఈవలి ఒడ్డు
కల నెరవేరడం ఆవలి ఒడ్డు

రెండు ఒడ్డుల మధ్య
మనిషి జీవన పయనమొక
పవిత్ర యుద్ధం

# అన్నదాత దు:ఖీభవ

వరివెన్ను విరిగినప్పుడు
దేశం వెన్నుపూస జలదరించలె
మబ్బులు దాగుడుమూతలాడినప్పుడు
గగనం కలవరపడలె
పాతాళగంగను రప్పిద్దామనుకున్నప్పుడు
ఊట ఊరట నియ్యలె
విత్తనం వొట్టి పోయినప్పుడు
మట్టిపెల్ల మూల్గలె
పంటకు బదులు పురుగు పండినప్పుడు
కార్తెల బలగం కనికరించలె
అప్పుల కుప్పల్లో
భరోసా చెక్కు గరిశె నింపలె
మందుల మాయాజాలంలో
ఉరిశిక్ష ఊసే ఉండదే
అన్నదాత బిరుదునికి
అన్నీ అవహేళనల దండలె
మోసాల రాజ్యంలో
తీన్ ఫస్లా గోసలె
బువ్వ పెట్టేటోడికి
బువ్వ తినే లోకానికి నడుమ
మూడో నోటికి పీటెవ్వడు ఏసిండు
రైతే రాజట

ఏ రాజ్యానికి ఎన్నడు కాలె
రైతు దేశానికి వెన్నెముకట
నిటారుగ ఎప్పుడు నిలబడలె

పొయ్యి మండకపోయినా
గుండెల మీద కుంపట్లు మండుతయి
లాకర్లు ఖాళీ అయ్యి
ఫికర్లు నిండుతయి
'చేనుకు చేవ – రైతుకు రొక్కం'
పొలం గట్టున పాతిన బోర్డు, పరిహాస మాడుతది

కాలు చెయ్యి ఆడని రందిల
ఉచితంగ ఉరి ఆదరిస్తది
చట్టం ఉలిక్కిపడి
సంతాప దినంలో గడుపుతది
పూలు, పేలాలు చల్లడానికి
రాజకీయం పోటీ పడుతది
స్వీయ ఎజండాతో, చానల్ చర్చలు జరుగుతున్నప్పుడే
బ్రేకింగ్ న్యూస్‌లో మరో మరణం దొర్లుకుంటూ వస్తది

ఎవరు ఎంత చేసింన్రో గని
ఎవరు ఏమి చేస్తరో గని

రైతు బతకాలె
బువ్వ బతకాలె

# వాన మాయ

నన్ను తడిపిన వాన-

కళ్ళ మీద కురిసి
ముళ్ళ చూపులు విరిచింది
నుదుటి మీద ముసిరి
అదృష్ట రేఖలు సవరించింది
నాసికాగ్రాన బిందువై జారి
తన సువాసన తెలిపింది
పెదాల మీద వాలి
బతుకొక్క చిరునవ్వును
కానుక ఇప్పించింది
చెంప మీద కారి
ప్రేమ కెంపుల చెమరింపులు
పూయించింది
మెడ మీద పారి
చక్కదనాల చక్కిలిగింతలు
తొణికించింది

నన్ను కడిగిన వాన -

ముసురు పట్టిన ఆకాశమంతా
నా వదనమై
ప్రకృతి అంతా నా గుండె గూట్లో
ఒదిగిన గువ్వపిట్టై ...

నన్ను విడువని వాన -

# నెవర్-ఎవర్

వల విసిరి
ఆకాశాన్ని బంధించలేవు

అది అనంతం గనక

సంకెళ్లు వేసి
నడకను ఆపలేవు

అది ఎల్లలు దాటేది గనక

అగ్నితో
వాక్కుని కాల్చలేవు

అది గాలిలో వ్యాపించేది గనక

కలకి
కొరివి పెట్టలేవు

అది పుట్టడానికే పుట్టింది గనక

వాక్యాన్ని
హింసించలేవు

అది ప్రతిధ్వని గనక

గౌరీ లంకేశ్
బహువచనం

# అపసవ్యం

చినుకు చిందని మబ్బు సోయగం
ఎన్నీల కాయని ఆకాశ వైశాల్యం
బారులు తీరని వెలుతురు కిరణాల తూరుపు కొండ
వృధానే
వ్యధ మిగులునే

వసంతగీత మొలకని పక్షి స్వేచ్ఛాగాన మాధుర్యం
గగన విహారం చేయని కొంగలబారు ఐక్యత్వం
దవన పరిమళం వెదజల్లని పూలకారు ఋతుధర్మం

ఉనికేలనో
మనకేలనో

తుమ్మెదల ఝుంకార  వలయాకృతాల్లేని పూలతోట ఆకర్షణ
చెట్టు కొమ్మన ఊయల్లూగని
పిచ్చుక గూళ్ళ, కిచకిచల సందళ్ళు
విడిచిన బాణం లా సాగని
చీమలబారు దృక్పథం

ఆశ్చర్యార్థకాలే
ప్రశ్నార్థకాలే

మూలమలుపులో ఎదురుపడే గాయం
చాచిన చేతిలో వాలే రేపటి చీకటి
వెన్నంటి వస్తూ, వేటాడుతూ, తలచుట్టూ
తిరుగుతున్న దుశ్చింతల కల

ఎప్పటి దాకానా
ఒప్పని దాకానా

## సువర్ణ తెలంగాణ

చుక్కలు ఆకాశానికి
చక్కిలిగింతలు పెట్టంగనే,
చందమామ ముఖం వెలిగినట్టు

మనం మునుం ఎల్లనీ

కాకుల కూతలకు
స్వరాలు కట్టనీ
రేగడి విత్తుల్లో కూరుకు పోయిన పొలాన్ని
కూకటి వేళ్ళతో పెళ్ళగించనీ
జంగిడి గోదల మెళ్ళోని
నెంబర్ బిళ్ళని తీసెయ్యనీ
నదులకు పల్లపు పారకం
అలవాటు చెయ్యనీ

పునః పునః
హైకమాండ్ పాదోదకం పావనం శుభం
అనడమే వింత

దస్తావేజుల మీద
కొత్తరాతలు రాయనీ
జానాబెత్తలు కొలిచి
హద్దురాళ్ళను పాతనీ
ఇంటి భాషలో
రాజ్యాంగాన్ని రచించుకోనీ
బతుకమ్మ ముఖచిత్రంతో
తపాలాబిళ్ల విడుదల చేయనీ

పునః పునః
ఉద్యమం స్వార్జితం
అనడమే వింత

కోస్తాంధ్ర కీర్తనలకు
మైమరుస్తున్న రామున్ని తట్టి లేపనీ
కలవరం లేని పోలవరం
కళ్ళ జూడనీ
విద్యుత్ వెలుగులు
విద్వత్ వెలుగులు
కీర్తి కిరీటాలు కానీ
ఆరు ఋతువులు
పన్నెండు నెలలు
సొంత గొంతులతో
పల్లెల్ని పలకరించనీ

పునః పునః
నిప్పుల్లో నడచినా కాలు గాలదు
అనడమే వింత

అస్తిత్వానికి
స్థిరత్వాన్ని, శాశ్వతత్వాన్ని
రంగరించి అద్దనీ
పేదొక రైతుగా
రైతొక రాజుగా
పరావర్తనం చెందనీ
ప్రతి పండక్కి
పల్లె గట్టున పాలపిట్ట వాలనీ
కళలు, సంస్కృతీ
కాపురాల్లో ఒలకనీ

పునః పునః
అవసరం వింత గాదు

ఆయుధాలన్నింటిని కట్టి, పెట్టు
జమ్మి చెట్టు మీదనే -

# సార్వభౌముడు

నడుస్తుంటవో
నడుస్తూ... ఆగుతుంటవో,
ఆగుతూ.. ఆగమైతుంటవో
నీ ఇష్టం

నెపాన్ని పిల్లి మీద నెట్టకు

మాట్లాడుతుంటవో
మాట్లాడుతూ... పోట్లాడుతుంటవో
పోట్లాడుతూ... సొలసిపోతవో
నీ ఇష్టం

లోపాన్ని విధి మీద  తోయకు

నిదురిస్తుంటవో
కాగిన కళ్ళతో కల వలలో చిక్కుకుంటవో
నీ ఇష్టం

ఉదయాన్ని దుమ్మెత్తి  పోయకు

రాస్తుంటవో
రాస్తూ... పరవశిస్తుంటవో
పరవశిస్తూ..ప్రపంచాన్ని మరచిపోతుంటవో
నీ ఇష్టం

లోకం గుడ్డిదని అనకు

సామ్రాజ్యం
స్వాతంత్ర్యం
నీ ఇష్టం

సమాజం చెడిందని తిట్టకు

# కవి జన్మ

ఆగిన చోటనే
పదమల్లడం మొదలు పెట్టాలి

మాటల దండ తెగిన క్షణాన్నే
జీవన కఠోర వాస్తవాల ఉద్గ్రంథావిష్కరణకు
ఏర్పాట్లు సాగాలి

వాక్యం కూలబడిన వేళ
బలమైన శీర్షికతో బలపరీక్ష పెట్టాలి

విషయం గందరగోళంలో పడిన తావున
ప్రతి చెట్టు ఆకుని పఠించాలి
బోధిసత్యం బోధపడేవరకు

లక్ష్యశుద్ధి లోపంతో రెపరెపలాడే భావదీపం
అరచేయి అంటుకున్నా సరే
ఆర్పాలి

ఉదాత్త అక్షరానికి
అఖండ దీపం వెలిగించాలి

అనవసరాలన్నీ అవసరాలై
అవసరాలన్నీ అనవసరాలై
మెడకు చుట్టుకుంటున్న
హింసాత్మక, మరణ సాదృశ్య సందర్భాన

కవిత్వమొక్కటే కాపాడుతది

సరిగ్గా,
పాళీ చిట్లిన చోట
ఒక కొత్త కవి జన్మెత్తుతడు

# ఆ రెండు పిట్టలు

ఏవో పాత మమకారాల తొణుకులలో పడి
ఆ వూరికి, ఆ ఇంటికి పోయిన
కిచకిచలాడుతూ రెండు పిచ్చుకలు
స్వాగతం పలికినయి చిత్రంగా !

విశాల ఆకాశపు అంచులను తాకినా
ఆ ఇంటి లోగిట్లోకి దూసుకు రాందే
అవిట్కి మనసన పట్టదేమో

గమనిస్తే ...
అవే ఆ ఇంటి రాజ్యమేలుతున్నట్లు
ఇంటినిండా మనుషులున్నా
వాటి మీదికే నా ఆశ్చర్యోన్మీలిత దృష్టంతా

దండెం మీద అటు ఇటు ఉరుకుతూ
ముక్కులతో గిల్లుకుంటూ
రెక్కబలం ప్రదర్శిస్తూ
కొంటెగా రెట్టలు వేస్తూ
క్షణ కాలం బుద్ధిగా వుండని
'బుర్ బుర్' శబ్దాల ఆపాతమధుర
వింత దృశ్యాల విన్యాసం
ఒక స్వేచ్ఛా ప్రియత్వ ప్రపంచాన్ని
పాదు కొల్పుతున్నట్లుగా –

గచ్చు అంచుకు దూలం మేకుకు
వేలాడ దీసిన
ఉట్టిలో ఉంచిన కంచుడులో
వడ్లను ఒలిచే కవితాత్మక నేర్పరులే అవి
ఇత్తడి బకెట్ కొసల తిరుగుతూ
నీళ్ళల్లో తలను ముంచి
పెయ్యంతా చిలకరించుకునే
చిలిపి చేష్టల పారవశ్యం

మాములుగా అనిపించే సమయాలను,
సన్నివేశాలను
Erase కాని అనుభూతులుగా
మలుస్తున్నాయా   అవి !

మళ్లేదో గుర్తుకొచ్చినట్లు
గోడకున్న అద్దంపై వాలి
తన ప్రతిబింబం తో కరచాలనం  చేసుకొంటున్నట్లు
ముక్కుతో టకటకలాడిస్తూ
ముచ్చటైన  పద్యం చెపుతున్నట్లు

అవి రెండే
పిడికిలంతా లేవు
ఇంటినిండా మోయలేని పండుగలాంటి
సందడే
ఎవ్వరడుగు పెట్టినా ఆ పిచ్చుకల ముచ్చటే

తిరుగు ప్రయాణం అన్య మనస్కంగనే

వస్తూ వస్తూ రెండు ఉట్లు తెచ్చుకున్నా
నా నగర భవంతి ముందర
వేలాడ దీసేందుకు

కళ్ళు మూస్తే
నా తెల్ల కాగితాల నిండా
అవే నడుస్తున్నయి రాజసంగా
కళ్ళు తెరిస్తే
ముద్రితమౌతున్న అక్షరాలై ఎగుర్తున్నయి

ఆ రెండు పిచ్చుకలకి
గుప్పెడు గింజలు వేయడమంటే
ప్రేమను పంచటానికి
ఒక చిరునామా మిగిలే వుందని
తెలుపటానికే

# తడిగీతాల వాడు

ప్రేమను పువ్వుల్లా వెదజల్లుతాడనో
అత్తరులా మనసుకు అద్దుతాడనో
ఆశతో అక్షరాలన్నీ కలిసి
అతన్ని రాజు ని చేసినయి

కలాన్ని పట్టుకున్నడు
మేధోమథనం  కన్నా
హృదయమథనం నేర్చుకున్నడు
అలసటను  జులపాల  వోలె  వదిలేసి
అన్ని వస్తువుల్లో కవిత్వపు రహస్యాలను,
ఏమీ తెలియదంటూనే వెతికి, తీస్తున్నడు

మాట్లాడుతున్నట్లే  వచిస్తడు
గుండెను కోస్తున్నట్టే  రచిస్తడు

గేటుమీద  కాకి  వాలితే
అమ్మ వచ్చిందంటడు
మనం అమ్మకు కొడుకులమై పోతం
పిలిస్తే పలికినట్లే వర్షాన్ని ఆహ్వానిస్తడు
మనం నిలువెల్లా తడిసిపోయి, కొత్త మొక్కలమై పోతం

సంచారజీవుని ఉప్పుబండికి కట్టిన
కందిలిని చూపిస్తడు
మనం వాని అమ్మకానికి నమ్మకాన్ని జతపరుస్తం
అలవాటుగా కంచం పెట్టకు అని
వీరుని భార్యకు మొర పెట్టుకుంటడు
అజ్ఞాతుని  పూర్తి కలని
మనం కనడం మొదలు పెడతం

కితాబులు సరిపోవు  అక్షర ప్రవాహానికి
బిరుదులు వెలవెల పోతయి
కవితా శీర్షికలు ప్రకటిస్తే –
పాతబస్తీ షాయరీ పావురమై
ప్రపంచపు గాలిలో పరిమళిస్తున్నడు

పుట్టుక
కవిత్వం కోసమేనేమో

నొక్కువడ్డ వెన్నుపూస నిలబెడుతున్నదీ
చేతికొచ్చిన మూడోకాలు నడిపిస్తున్నదీ
బతుకాశను రంగరించిన కవిత్వం కోసమే !

# సంబురం

“నాకు ఉగాదులు లేవు ఉషస్సులు లేవు”
అని ఏ ఏకాంత మనోవేదన లోంచో
కవికి  ఆ భావన పుట్టిందో గని
ఏ పండగైనా ప్రాణికోటికి అలంకారమే
కొత్త అల వచ్చి నదిని తాకి
చక్కిలిగిలి  పుట్టించినట్టు
చిరు ఆశ
రేపటిల  అడుగు పెట్టించినట్టు –

కాలం మళ్ళా ఒక కొత్తముఖంతో
సంవత్సరం పాటు మనతో సంచరిస్తది
‘దుర్ముఖి’ సుందరముఖి కాకూడదా
మన్మధనామం ల అంతా మన్మధులై పోలేదు గద
పేర్లతో పేచీ ఎందుగ్గని
తీర్ల తీర్ల పేర్ల ముచ్చట్లని మురుద్దాం

ఊర్లె ఉగాది
చిన్నప్పటి ఉగాది
ఎవ్వరికైనా తీపిగుర్తులే
పండగ ఒక్కరోజే అయినా

జ్ఞాపకాలు అనంతాలు, సజీవ ఊటలు
ఒడిలోని ఒకే ఒక జ్ఞాపక యవనిక పై ప్రయాణించి చూడు
కోయిలల గానకచ్చేరి వినిపించిందా
షడ్రుచుల పచ్చడిల  అనంత జీవన  వేదాంత మూలాలు
కనిపించినయా
తిథి, వార, నక్షత్ర, యోగ, కరణ పంచాంగ శ్రవణాన్ని
పంతులుగారి పాండిత్య ప్రసంగానికి
పాసిటివ్ గనే తలూపినట్టు వున్నదా
అట్లనే మరోటి మరోటి

పండగ
నీకొక కిరీటం తొడుగుతది
తంత్రాల కుతంత్రాల లోంచి నిన్ను
ఇచ్చింత్రాల ముగ్గుల్లోకి దింపుతది
రాజ్యావమానం నుండి
రాజ్యపూజ్యం వైపు పాదం కదిలిపిస్తది
ఏ తిథినైనా నీ ఇంటికొచ్చే అతిథి గనే చూడనిస్తది
శని ఏడింతల పద్మవ్యూహం పన్నినా
రాహుకేతువులు బుసలు గొట్టినా
రెట్టించే కోయిల కూతల
నీ గెలుపు మంత్రముంటది

నగరాని కొచ్చితివా
నాగరికతతో పెరిగితివా
పండక్కి అర్థం వీకెండే
మూలాల్ని  తన్నేసి, మేడల్ని కావలించుకునుడు
పిట్ట పాడే పాట, సూర్యోదయ అరుణిమ
ఇప్పటి పిల్లలకేం ఎరుక

ప్రాకృతిక పంచభూతాలైన
నేల, నిప్పు, నీరు, గాలి, ఆకాశాలతో
దైహిక పంచేంద్రియాలైన
చూపు, వాసన, రుచి, వినికిడి, మనసు లు
చెట్టపట్టాలేసుకునే రోజుల్ని కల గంటవా

ఇస్తర్ల భక్ష్యం, దొప్పల పచ్చడి
నీ కలకి అండగ వుంటయి

# తల్లిగారి ఊరు

పెద్దగుండవెల్లి ...

పేరు గుర్తొచ్చినప్పుడల్లా
ఈ చిన్న గుండె
పెద్ద గుండై ఉప్పొంగుతది
ఊరు విడిచాననో, నగరీకరణలో తడిచాననో
ముఖం విప్పార్చి, ముఖస్తుతి కై
అక్షరసత్యమని వక్కాణించడం లేదు

ఇవ్వాళ్ళ అక్షరం రాసినానంటే
అక్కడ నేలమీద కూచుని
పగిలిన పలక మీద
పితుకంత బలపంతో దిద్దుకున్నదే
తొడపాశం పెట్టిన పున్నయ్య సారే
పద్యామృతం తాపిచ్చిండు
మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ
సంస్కృతార్థాలు తెలియకున్నా
గురువు మాట లక్ష్మణరేఖనే అయ్యేది

అట్ట పుటలు ఊడినప్పుడల్లా
చారి సోపతి తోడయ్యేది

ఇసుక కుప్పలో కుస్తీపోటీకై
బాలభీముల మయ్యే వాళ్ళం
ఇప్పటి బతుకుకా కుస్తీ మార్గదర్శే మరి !

నాన్న లేదని, పక్కింటి పాలి అన్నయ్య
బడిలో చేర్పించడం
ఏ విలువకు పరాకాష్ట !
మనిషిని ప్రేమించడం ఆయన ద్వారా ఆవహించుకున్న

అమ్మకు నేనొక్కడినే
నా హఠాన్ని దాచిన గరళకంఠురాలు
ఓపిక అనే  దీపిక
ఆమె వెలిగించిందే నాలో

వాడకట్టు జనం
'చిన్న పంతులు, చిన్న పంతులు'
అని పిలుస్తుంటే
జ్ఞాన పీఠం మీద కూర్చుండబెట్టినట్లే ఉండేది
వాడకట్లన్నీ తిరుగుబోతై తిరుగుతుంటే
పండుగలన్నీ చుట్టూ మూగేవి
నామం దిద్దుకున్నానో మలిపేశానో
తీర్థం పుచ్చుకున్నానో జార విడిచానో
గాయత్రీ పఠించానో మరచిపోయానో

సంప్రదాయం కన్నా అలయి బలయి
నా బడాయిగ ఉండేది

పానాది ల నడిచేటప్పుడు
కాళ్లకు ముళ్ళు గుచ్చినా

పాము బుసలు భయం పుట్టించినా
మడికట్టు నాగలి దున్నుతూ
ఎద్దు కాలికి కర్రు తగిలించినా
తేనెటీగలు ముసిరి
ఒరాల మీద పరుగు తీసినా
దురస్తుకై ఇల్లు విప్పి
అర్ధరాత్రి జడివానకు
పులుగు పులుగోలే గోడవారగా
అమ్మా నేను గడిపినా
బోధిసత్వుని జ్ఞానోదయం లాంటిదేదో
బతుకుకు సంబంధించి
వినిపిస్తూ వుండేది  అంతర్లీనంగా !

స్వేచ్ఛకు రెక్కలు తొడిగిన ఊరు
ఇచ్ఛకు ప్రయోజనం తెలిపిన ఊరు
కని పెంచిన ఊరు
కడుపుల పెట్టుకున్న  ఊరు
కీర్తి శిఖరాలకు ఎగబాకించిన ఊరు
అంతకన్నా ముఖ్యంగా
నన్ను కవిని చేసిన ఊరు

నేలపై  పారాడిన
మట్టిలో పొర్లాడిన
నా ఊరికి  నేనేమివ్వగలను?
ఒక అక్షరం తప్ప
ఆ అక్షరంతో ఒక మంచి సమాజం
నిర్మించి ఇవ్వడం తప్ప

# లేనితనం

పువ్వు పూస్తున్నది
మరచిపోయిన నవ్వుని, అడిగి పులుముకోవు

పిట్ట పాడుతున్నది
ఏడుపు ఆపి, గొంతుతో శృతి కలుపవు

మబ్బు కురుస్తున్నది
వాడిన కలకు చినుకు సొగసద్దుకోవు

పవనం పయనిస్తున్నది
కూలబడ్డ బతుకుని ఒక్క కుదుపు కుదుపవు

పొద్దు పొడుస్తున్నది
గమ్యాన్ని వెలుగుల్లో రమ్యంగా అలంకరించుకోవు

సీతాకోకచిలుక ఎగురుతున్నది
ముళ్ళకు తగిలిన అనుభూతులను
మెల్లగా తీసి, ఎగరేసుకోవు

చంద్రుడు పౌర్ణమి యై వెలుగుతున్నడు
ఉత్సవానికి హృదయమెప్పుడూ సిద్దంగా వుంచుకోవు

నది నడుస్తున్నది
నడకేమిటో తెలుపుతున్నది
మదిలో అది నింపుకోవు

అడవి చిగిర్చుతున్నది
పుడమికి భరోసావాక్యం లిఖిస్తున్నది
అనుసరించవు

ఆకాశం భూమి సుదూరతీరం మీద
కలుసుకుంటున్నయి
ముచ్చట్లు పెట్టుకుంటున్నయి
మన గురించే
మనిషి గురించే

ప్రకృతి ముందు తలెత్తలేని మనిషి గురించే

# కవితా వందనం

ఆత్మను పలికించిన మీ అక్షరం
మాకు మంటలూ–మానవుడు ని
దర్శింపజేసింది
నాగార్జున సాగర జలపాత కొత్తపుంతలలో
తడిసి, ముద్దయి
మీ కవిత్వ మోహ పరవశులు
కాని దెవరు ?

చిలకతో మనిషిని
మనిషితో చిలకని
మాట్లాడించిన నేర్పరులు మీరు
యమ మరణాన్ని నిలబెట్టి
కవితా రణ విద్యల
మెప్పించిన తీర్పరులు మీరు
సమదర్శన బాటలో నడచుట
మీ నిలువెత్తు చక్రవర్తిత్వానికే చెల్లింది
రాసిన కార్డు ముక్కలో
సినారె సంతకం
అందినవారందరి మనసులో
మెరిసే పచ్చల పతకమే ఎప్పటికీ !
ప్రేమ తత్వమేనా
తాత్విక తత్వమేనా
మట్టితత్వ మొకటుంటుందని
బోధించిన మీ గజల్
నేలమీద నడయాడిన కవిత్వానికి

అసల్  చిరునామా
ప్రపంచ పదుల్లో
మీ ప్రాపంచిక దృక్పథం
సాంప్రదాయంలో ఒక ప్రయోగం
ప్రయోగంలో ఒక సాంప్రదాయం

కలం ఝుళిపించినప్పుడల్లా
మీరు కర్పూర వసంతరాయలే
భాషలో ఆ పుట్టతేనె
ఊహలో ఆ పూర్ణచంద్రమణికాంతే
లిపిలో మాత్రం మరువని
మధ్యతరగతి మందహాసమే

కవిరాజా
సాహితీ హిమవన్నగమా
తెలిసిందిలే

మీ వదనం
అరుణోదయ కమలంలో
దృగ్గోచరమవుతుందట
మీ హృదయం
ప్రతి తూరుపులో ఉదయిస్తుందట

మీ జ్ఞానపీఠం
కవిలోకపు ఆఖరి స్వప్నమై
ఊరిస్తుందట !

# జంట పథం

ముద్దు సరే
అరుగు మీది ధారావాహిక ముచ్చట ఎచ్చోట ?

అడ్డు లేని, ఆకాశం ముట్టే స్వేచ్ఛ సరే
అదుపు తప్పిన, పరిధి మీరిన
పర్యవసాన సోపానాల్లో చోటెక్కడ ?

నింగి మబ్బుల్లో చందమామలా దోబూచులాడుతవు మజాలే
నేల లోపల విత్తనమై చిట్ల రావెందుకు

కాకుల అరుపుల చికాకుల దాడుల
కలెబడతవు మరే
చితి దాకా చింత తరలుట ఎట్ల ?

గతానుభవాల సుడుల రాత్రుల కలియ తిరుగుతవు భలే
పయన ముంటది
వెలుగు కోసమే అని కదా !

# తెలంగాణీయత

ఇవాళ
నా కవితా వస్తువు
పరాధీన నుండి స్వాధీన తెలంగాణ

మట్టిబంధం లాంటి వస్తువు చుట్టూ
అల్లుకున్న కవిత్వాంశాల కలబోత

అలంకారం –
ఉగ్గబట్టిన మగ్గం బతుకుల
కలనేత చేనేత దరహాసం
పదబంధం –
చావుపంటల కాపు కుతికెల
జారుతున్న అన్నం ముద్ద
భావచిత్రం –
పట్టువట్టి, ఎగిరిన జెండామీద
నిలవడ్డ మొనగాడు పాలపిట్ట
శిల్పం –
అలల పురులు విప్పి
అనందతాండవ మాడుతున్న చెరువు

నడక –
ప్రయాస లెరుగని ప్రయాణ మొక్కటే ప్రమాణం

అగమ్యాలకు రూపమిచ్చి
గమ్యాలను ముద్దాడుతున్న వైనం
అన్వయం –
పాపా, చేపా పరుగులు
మట్టీ, ఐటీ మెరుగులు
ప్రయోగం –
దొంగ కొంగ జపాలకు టక్కున ముక్కున వేలు పడి
అందని మర్మాల నూతన ఒరవడి
శ్లేష –
దండమా... దండననా...
ఇరుగు పొరుగు కుంపట్ల మంటలా...వెలుగులా
పద్యంలో ఇమిడిన అందం –
పదహారణాల పల్లీయత
గోదావరి పాయలా దొరలుతున్న దృశ్య రామణీయత

ముగింపు వాక్యం –
తెలంగాణకు పర్యాయ పదం
బంగారు తెలంగాణ

# పండుగొచ్చిన వేళ

గుడిసె మీదెక్కిన కోడిపుంజు
పండుగ పిలుపును తీయగా కూసింది
తూర్పు సమీరం
అప్పుడే విచ్చిన సూర్యగుచ్చాన్ని కానుకగా మోసుకొస్తున్నది
గూట్లోని గువ్వపిల్లలు రెక్కలు మొలిపించుకొని
పనులకు బయలెల్లినయి
చెట్లు
ఆహ్వాన పత్రాల్ని లిఖిస్తున్నయి
మేఘాలు
చలువ పందిళ్ళల్లుతున్నయి
దారులన్నీ
పూలతేరులై పరచుకున్నయి
మామిళ్ళు విరగ కాసి
లోకం వాకిట్ల తోరణాలవుతున్నయి
పొలిమేరల్లో ఎనిమిది దిక్కులు
బాజా భజంత్రీలు మోగిస్తున్నయి
కొత్తబట్టల్ని, ఆకుపచ్చ రంగుల్లో నేసి
ప్రకృతి పంచుతున్నది

సింగారించుకున్న ఆటవిక సుందరి
గానా బజానా మొదలవుతున్నది

ఆయుధాలన్నీ
బంగాళాఖాతంలోకి విసరబడుతున్నాయి
యుద్ధాలన్నీ
నేల మాళిగలో సమాధై పోతున్నాయి
పొర పొచ్చాలన్నీ
ఇచ్చుకాలవుతున్నాయి
ఎక్కువ తక్కువలన్నీ
సమతూకాలవుతున్నాయి

అరిటాకు విస్తరి ఒకటే వేసింది
అన్ని రుచుల వడ్డన ఒకటే జరిగింది
గుండ్రంగా కూచున్న జన ప్రపంచానికి
పెద్ద పెద్ద ముద్దలు చేసి,
చేతుల్లో పెడుతున్నది
పేదరాశి పెద్దమ్మ

# బాపు లెక్క ఎవ్వరుండరు

బాపుకు నేను ఏకలవ్య శిష్యుణ్ణి...నా ముద్దు మురిపాల్లో తను మునిగి తేలిండేమో, తన ఒడిలో నేను మాటల మెగ్గయి విరిసినట్టు గుర్తు లేదు. నా రూపురేఖలు సవరించి వుండెనేమో, తన ఛాయాచిత్రం నా కళ్ళల్లో అచ్చుకాలేదు. ముదిమే మోయలేని దేహం మడతల్లోంచి, ఎత్తుకోలేని నా భారీ చిరుప్రాయం ఒలికిపోతుంటే, చాతకానితనపు వేదనామయ ఘనీభవనం ఎంత మోసిండో. ఆడిచ్చినట్టు, పాడిచ్చినట్టు ఆలించినట్టు, పాలించినట్టు సాక్షాలేడ తేను? పెరుగుతున్న కొద్దీ ఎవరో లేరన్నట్టు, బతుకు బండికో చక్రం మాయమైనట్టు, పట్టుకోడానికి చిటికెన వేలేదని అమ్మను అడిగానో లేదో.పగిలిన పలక మీదే రాయడమెందుకో, చిరిగిన చెడ్డీలకు మాస్క లెందుకేయడమో, ఉన్నోల్ల, లేనోల్ల ఇండ్లల్ల వంటల పొయ్యిలేసి, ఇచ్చిందేదో తెచ్చుకునే ఖర్మేందుకు పట్టిందో అర్థం కానట్టు, మరోసారి అయినట్టు. లేనితనమా, తను లేనితనమా ? పెద్దరికపు బాపు లేనితనమే పేదరికపు మూలం.

కరణీకం పంతులు చేతికింద రాతగానిగా చేరినా, పట్టించుకోని నలుగురున్న ఇంట్లనుంచెల్లి దేశ దేశాలు తిరిగినా ముద్దపప్పసొంటి,ఎన్నీల ముద్దసొంటి మనిషే, మనసే. అమ్మ చల్లకు తోలినా, చెంబుదాచుకునే నిలబడేదే.

వున్న ఒక్క ఫోటో అట్ట మలిగిన పొయ్యిని విసురుతూ ఉంటే, అగ్గిలో పడిందట. అగ్గిని వెలిగించేటోడు అయిండు.

ఆ రాజేసిన వెలుగేదో నాలో నిక్షిప్త పరిచి, వెళ్ళిండేమో.
తానిచ్చిన ఈ శరీరంలో ఒక అక్షరమై వెలుగుతున్నడు.

బాపూ! నీ పక్కకు అమ్మ చేరే వుంటది. నా అక్షరాలతో సంభాషిస్తూ
పొద్దు గడుపుండ్రి !

# స్టైల్ ఆఫ్ లైఫ్

కొన్ని పూలు ఇన్ని రాళ్ళు ఏరుకో ఏరుకో
సమయమో అవసరమో ఏవి వాడాలో నిర్దేశిస్తది
గోడలు కట్టుకుంటూ పో పో
ఎటు వైపో దుంకడానికో
లేదూ బద్దలు కొట్టడానికో పనికొస్తయి
నాలుక మీద కత్తికి రెండంచుల సాన పెట్టు
ఒక వైపు తేనే అంటించు
వెటకారమో మమకారమో
ఏ అర్థమైనా వచ్చేటట్లు ఒడుపుగా విసురు
కళ్ళద్దాల లోపలి చూపులకు
బయటి చూపులకు ఒక పాయింటైనా
తేడా వుంచు
సన్నివేశానికి తగ్గట్టుగ అతికించుకోవచ్చు
వాక్యాల మధ్య ఖాళీలో, బ్రాకెట్లోపెట్టు
పొగడ్డానికో తెగడ్డానికో
ఫిలప్ చేసి వాడుకో
అట్లా వెళుతున్న వాడికొక నమస్కారం పడెయ్
దాచిపెట్టుకుని, మరచిపోయిన నోట్ లా
ఎప్పుడైనా పనికి రావొచ్చు
వెన్నెల రేయిని కాళరాత్రిని సమానంగా పొగుడుతూ వుండు
ఆయా వేళలకి నీకేది ఇష్టమవునో తెలియదుగా మరి
రెండు జేబుల్లో రెండు కండువాల్ని దూర్చు
ఏ జెండా ఎగిరినా నీదై పోతది

ఇంట్లొక మాట బయటొక మాట
వుండనీయ్
ఏ సందర్భం లోనైనా
నువ్వు లక్కులో చిక్కొచ్చు
నుదిటి మీద always welcome అని రాయించుకో
ప్రతోడికి నీ చిరునామా
మెమొరి కార్డ్లో చేరిపోతది

దేనికీ మొహం వాచి, దేబురించకు
సులువైన టెక్నిక్కులు మార్కెట్ లోకం లో బోలెడు
అన్నింటినీ బాగా గుర్తుంచుకో
ఒక్క మనిషిని తప్ప
ఎప్పటికెయ్యది ప్రస్తుతమో
అయ్యది దక్కించుకో కో

అమ్మ గర్భం మీది పసిబిడ్డ నాటి
గుర్తులు చెరిపేస్తూ ... చెరిపేస్తూ –

## ఎంతవాడు

మడికట్టు
దేహం విచ్చిన నెర్రెలతో
ఆకలి సుడిగాడ్పై రివ్వుమంటది

ఇరిగిన నాగల్ని
భుజానికెత్తుకున్న
యేసుక్రీస్తులా వాడు

తనకు పానమైన
వానకోసం
కరిమబ్బుల్ని రప్పించుకోలేని
శిక్షించనూలేని
అబలుడు వాడు

పెట్టుబడి
మోసం చేస్తదని తెలిసినా
కాలంమీది నమ్మకంతో
చంద్రమతి హారాన్ని
దద్వత్ పెట్టిన దీనుడు వాడు

శేను గలగల నవ్వుతున్నప్పుడు
వడగండ్లు ఎందుకు కురుస్తయో
ధాన్యంబండ్లు ఇంటికి చేరుకోకుండనే
మార్కెట్ మాయాకన్నెందుకు తెరుస్తదో
తెలియని అమాయకుడు వాడు

కాపువాడు
తరాలు మారినా ఏం
మారని రూపువాడు

తొలకరి వాసనేయంగనే
పెద్దబాడిసతో దుంపగర్రను చెక్కించి
కమ్మరింటికి వెళ్ళి, కర్రుకు మొన పెట్టించి
కొండల్లో పిలుపేసి, కొంరెల్ని దున్నేసి
బంగారం పండించే మొనగాన్నోలె
మీసం మెలిపెట్టేసి –

ఆరుగాలం కష్టానికి
జమాఖర్చు రాసుకోలేని
అంగుటి నిషానోడు
అన్నం పెట్టడానికి
పుట్టినాననుకుంటడు

ఏమంటరు వాన్ని –

# ప్రియవచనం

అడుగు
వెనకడుగు అయినప్పుడు
గమ్యం నుదుటి మీద గగనమై ప్రతిబింబించాలె

చూపు
వెరపు లోనో, మరపు లోనో పడిపోయినప్పుడు
ఆంత్రర్నేత్రం వికసించి, భ్రాంతి లేని కాంతిపుంజం ముట్టాలె

మాట
మోమాటమై, ఓటమై పోయినప్పుడు
ఉక్కు వాక్కొకటి కవి రాసింది చదువాలె

చేత
మొక్కవోయిన, పక్షవాతమైన సమయాన
ఉల్కాపాతమై రాలిన సంకల్ప మనోగతం మనోవేగం కావాలె

జీవితం పంతమై, అర్ధాంతరమై పోతున్నప్పుడు
నేనో, నువ్వో, అతనో
వారో, వీరో, ఎవరో
'స్వంతానికి బతకటం'

కవి నిషేధిత వాక్యం !

# తెలంగాణ ముఖచిత్రం

పిడికెడు నుడుగులు
దోసిట్ల తీసుకొని నడుస్తున్న
జాడ
అతడు వేసిన అడుగులదే
నుడుగులూ
పలుకు బడులవే

బక్కపానం
చూసిన ఎతలే తిక్క
ప్రహ్లాదుడు, సామాన్యుడు
ఇరుపక్కలు
విశాలతకు తల ఒగ్గినా
ప్రాంతీయతే పగ్గం
జైలయినా, పద్మవిభూషణమయినా
లాల్చీ, ధోవతీ, జబ్బకు వేలాడే బట్ట సంచీయే

ఖాతర్ చేయని అందలాలు
ఖదర్ చేసిన ఉద్యమాలు
వలస వచ్చిన తరం
కంచుకంఠ ధిక్కారం
ఒక వరం

నిర్బంధ విధ్వంసం కోసం
దేవుడి ఉత్సవమే పణం

విద్యార్థిగా తొలి కవిత
భగత్సింగ్ ఉరి నిరసన
అన్న అక్షరాల ప్రేమ
ఆకర్షించిందో ఉదయాన

ఆర్యసమాజం, ఆంధ్రమహాసభ
తిరుగుబాటు విలువలకి ఉత్ప్రేరకం
అన్యాయం, అవహేళన
ఆగ్రహజ్వాలకి సంప్రోక్షణం

సకిలించిన పరాయిభాషను
వెక్కిరించిన ఇంటిభాష
మట్టిని, అవ్వను మరిచినందుకు
సోయి తెప్పించిన గొడవ

సారస్వత పరిషత్, తెలుగు అకాడమీ
నాటిన విత్తనాలు
ఫలాలు
అమృత రసాలు
నీడలు,
ఎదుగుదలకి ఆహ్వానాలు

ఆకలిమంటల, అన్నపురాసుల మధ్య
వ్యత్యాసం
ఆశువైన ఎనిమిది సంపుటాల
పాశుపతాస్త్రం

సృజన
ముచ్చట పెట్టుతున్నట్లే
నడక
పిడికిలి బిగించినట్లే
గుణం
ఆటుపోటుల ఓటమికి
వడిసెల విసురుతున్నట్లే

అణాకథల కథనం
బహుభాషా వచనం
'నా' నుండి
'మా' దాకా,
'మా' నుండి
'మనం' వరకు
వచ్చేటందుకే

తెలంగాణను కల గనీ
తెలంగాణను గెలువాలనీ
తెలంగాణగా బతకాలనీ
భాషలో
భావనలో
చేతనలో
కాళన్న యాది
నిలువనియ్యది
మరువనియ్యది !



**VIRAMINCHANI VAAKYAM**

Poetry

**daasaraju ramarao**

ఒక ఊహ

ఒక స్పృహ

ఒక రహస్యానంతర జిలుగు

ఒకానొక మైమరపించే మేల్కొలుపు

కవిత్వం

అక్షరం.. కాలం.. మనిషి

చెట్టాపట్టాలేసుకొని నడిచే

సహజ జీవన దృశ్యం

నేను గెలుచుకునే కల

